హకీంపేట ఫ్యాక్టరీతో ఆయిల్‌పామ్ సాగుకు మరింత ప్రోత్సాహం

చింతల్‌పల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం



పుడుర్ నవంబర్ 4, (వూదయం) వికారాబాద్ జిల్లా వుడుర్ మండలం చింతల్‌వల్లి గ్రామంలో ఎకో పామ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు గ్రామ సర్పంచ్ కుని సుగుణమ్మ, ఉప సర్పంచ్ యాటకారి బిక్షపతి ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ పిఎంఓ టీ. విజయ్ కుమార్, ఎఫ్ఓ నవీన్ చారి, క్లస్టర్ మరియు ప్రకయత్ అధికారులు పాల్గొని ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత, సాగు విధానాలు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, మొక్కల సంరక్షణ, దిగుబడి మరియు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాల గురించి రైతులకు వివరించారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సుమారు 30 సంవత్సరాల వరకు దిగుబడిని పొందవచ్చని వివరించారు. ఇతర కొన్ని పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ తోటలు ప్రకృతి వైపరీత్యాలను కొంతవరకు తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. నిరంతర దిగుబడి ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించి, వారి ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

హకీంపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడంతో ఈ ప్రాంత రైతులకు ఆయిల్‌పామ్ గెలల విక్రయానికి స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రస్తుతం వుడుర్ మండల పరిధిలో 307 ఎకరాల్లో, వికారాబాద్ జిల్లాలో మొత్తం 4,052 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బి బాలకృష్ణ రెడ్డి, పి రవీందర్ రెడ్డి, యం జంగయ్య, శ్రీశైలం, రంగారెడ్డి, కుని రాములు, సి పి శ్రీనివాస్ రెడ్డి, కొండన్న నరేష్, అంతయ్య, గ్రామరైతు సమితి అధ్యక్షులు కుర్వ నర్సింలు, కారోబార్ శ్రీనివాస్,పాల్గొన్నారు. గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గొడుగుపల్లిలో ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
ప్రారంభించిన సర్పంచ్ మద్దెల వనజ, ఎంఈఓ గజ్జెల కనకరాజు



దౌల్తాబాద్ నవంబర్ 03(వుదయం):మండలంలోని గొడుగుపల్లి గ్రామంలో చిన్నారులకు ప్రాథమిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ మద్దెల వనజ స్వామి, మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి చిన్నారులకు విద్యాబోధన అందించే విధానంపై ఉపాధ్యాయులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంఈఓ గజ్జెల కనకరాజు మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధికి పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని పేర్కొన్నారు. బాల్యంలోనే అక్షర పరిచయం, సంఖ్యా పరిజ్ఞానం, క్రమశిక్షణ, ఆటపాటల ద్వారా నేర్చుకునే అలవాట్లు పెంపొందించడం వల్ల భవిష్యత్తులో విద్యాభ్యాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపిస్తూ ఉపాధ్యాయులకు సహకరించాలని సూచించారు.సర్పంచ్ మద్దెల వనజ స్వామి మాట్లాడుతూ గ్రామంలోని చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రతి చిన్నారికి విద్య అందేలా గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.ప్రీ ప్రైమరీ విద్య ద్వారా చిన్నారుల్లో చదువుపై ఆసక్తి, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలు పెంపొందించేందుకు అవకాశం కలుగుతుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామంలోనే విద్యకు మంచి పునాది ఏర్పడటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, ఉపసర్పంచ్ దుర్గాని దీపిక మధుసూదన్, ఉపాధ్యాయులు మనోజ్, శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు సట్ట లింగం, నల్ల ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి భాను శేఖర్‌రెడ్డి, నల్ల మల్లేష్, మైపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రేఖ, నాగరాణి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

వాహనదారులకు పూలు అందించి హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి



సంగారెడ్డి వుదయం : రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్ శాఖల సహకారంతో యూరో కిడ్స్ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వాహనదారులకు పూలు అందిస్తూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. చిన్నారులు స్వయంగా ముందుకొచ్చి వాహనదారులకు అవగాహన కల్పించడం అందరినీ ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకురావడానికి విద్యార్థులు చేపట్టిన కార్యక్రమం ఉపయోగకరమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి, టౌన్ సీఐ రామనాయుడు, యూరో కిడ్స్ పాఠశాల ప్రిన్సిపల్ అర్చన, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాజిద్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యలో కోహీర్ మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి!

ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్



కోహీర్, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి):
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కోహీర్ మండల విద్యాధికారి మహమ్మద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. క్రమశిక్షణ, విషయ పరిజ్ఞానం, సమయపాలనతో పాటు సమర్థవంతమైన బోధనా పద్ధతులను అవలంబించినప్పుడే విద్యార్థులు విద్యలో రాణించి, తమ ప్రతిభను వెలికితీస్తారని పేర్కొన్నారు.

మంగళవారం కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా ప్రమాణాల్లో కోహీర్ మండలాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)లో నిర్దేశిత స్థాయిని సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఆన్‌లైన్ కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా నాణ్యమైన బోధనాభ్యసన సామగ్రి (టీఎల్ఎం) రూపొందించి వినియోగించాలని ఆదేశించారు. ఈ సమావేశం బిలాల్‌పూర్ జెడ్పీహెచ్ఎన్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుచరిత వర్యవేక్షణలో నిర్వహించారు. మండల రిసోర్స్ పర్సన్లు ప్రసాద్ రావు, రాజ్‌కుమార్, ప్రసాద్, సింహాచలం, ఇబ్రహీం, గోవింద్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం దుకాణాల వద్ద ప్రభుత్వ హెచ్చరిక ఫ్లెక్సీలు!

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 1967



కోహీర్, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని బియ్యం దుకాణాల వద్ద ప్రభుత్వం ధరల వివరాలతో కూడిన హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. వినియోగదారులు మోసపోకుండా బియ్యం రకాల వారీగా కిలో ధరలను ప్రదర్శించింది.బీపీటీ /కేఎన్ఎం.రూ. 66 ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా రూ. 74.హెచ్ఎంటీ / జేఎన్ఆర్ రూ. 79.నిర్ణయించిది.వినియోగదారులు దుకాణాల వద్ద ధరలను పరిశీలించి కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేసినా, రేషన్ బియ్యం అక్రమ విక్రయాలు, నిల్వలు గుర్తించినా ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయం లేదా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.ప్రతి బియ్యం దుకాణంలో ధరల పట్టిక వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యానికి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరుతున్నారు. ధరల విషయంలో వ్యాపారులు పారదర్శకంగా వ్యవహరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ప్రజలు కూడా అధిక ధరలపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి సర్పంచ్ అండ

50 కేజీల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత
మానవత్వం చాటుకున్న గంధం ముత్యాలు, మహ్మద్ షాపూర్



దౌల్తాబాద్ నవంబర్ 03(వుదయం):
ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామ సర్పంచ్ గంధం ముత్యాలు, మండల పరిధిలోని మహ్మద్ షాపూర్. గ్రామానికి చెందిన చిన్నలచ్చి కావేటి మల్లయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న వారు ఆయన కుటుంబ పరిస్థితిని గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించారు. మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి 50 కేజీల బియ్యంతో పాటు రూ.5 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.కుటుంబ పెద్దను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబానికి ఈ సమయంలో కొంతైనా ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం కష్టకాలంలో ఒంటరిగా లేదనే భరోసా కల్పించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత మేరకు ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని, తోటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు స్పందించడం నిజమైన మానవత్వమని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులుగా ప్రజల సమస్యల్లో భాగస్వాములవుతూ, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.
కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, గ్రామ ప్రజల సుఖదుఃఖాల్లో పాలుపంచుకుంటూ సామాజిక బాధ్యతను చాటుకోవడం మంచి పరిణామమని స్థానికులు ప్రశంసించారు. మల్లయ్య కుటుంబానికి అందించిన సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మిడ్జిల్ లో 152 దూడలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



మిడ్జిల్; నవంబర్ 3, వుదయం
పాడి రైతులు ఆరు నెలల లోపు దూడలకు ప్రతినెలా నట్టల నివారణ మందులు తాగించాలి: పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్
మిడ్జిల్: మండలంలోని బైరంపల్లి, బోయిన్పల్లి, వాద్యాల గ్రామాల్లో మంగళవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 152 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు.
ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్ మాట్లాడుతూ.. దూడల్లో నట్టల నివారణ ద్వారా రక్తహీనతను అరికట్టడంతో పాటు శరీర బరువు త్వరగా పెరగడానికి, సంతానోత్పత్తి సామర్థ్యం మెరుగుపడటానికి, రోగనిరోధక శక్తి పెంపొందడానికి దోహదపడుతుందని తెలిపారు. ఆరు నెలల లోపు వయసున్న దూడలకు ప్రతి నెలా తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాగించాలని పాడి రైతులకు సూచించారు.

నేడు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ శిబిరం

నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు ఆవరణలో నేడు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్సీ) మెగా క్యాంప్ నిర్వహించనున్నట్లు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) బ్రాంచ్ మేనేజర్ యశస్వి ప్రసాద్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ ప్రభుత్వ శాఖల రిటైర్డ్ ఉద్యోగులు, రక్షణ, టెలికం, ఈపీఎఫ్ఓ పెన్షనర్లు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పెన్షనర్లు తమ ఆధార్ కార్డు, పెన్షన్ వివరాలు, మొబైల్ ఫోన్ తీసుకొని రావాలని సూచించారు.
శిబిరం ప్రయోజనాలు : జీవన్ ప్రమాణ్ ద్వారా పెన్షన్ నిరంతరంగా పొందవచ్చు, బ్యాంకుకు వెళ్లే ఇబ్బంది తగ్గుతుంది, బయోమెట్రిక్ ద్వారా సులభంగా ధ్రువీకరణ పూర్తవుతుంది.

దౌల్తాబాద్ తహసీల్దార్ ఉదయశ్రీకి ఘన సన్మానం

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వక భేటీ
శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



దౌల్తాబాద్ నవంబర్ 03(వుదయం): దౌల్తాబాద్ మండలానికి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉదయశ్రీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ఉదయశ్రీ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, భూ రికార్డుల సవరణలు, పట్టాదారు పాసుపుస్తకాలు, వారసత్వ భూ బదలాయింపులు తదితర సమస్యలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

అదేవిధంగా నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాలని, రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల సానుకూలంగా స్పందిస్తూ పారదర్శకమైన పాలన అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం కలిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

దౌల్తాబాద్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఉదయశ్రీ మండల ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్ణాల శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ యాదగిరి, తిరుమలాపూర్ సర్పంచ్ బండారు లాలు, మండల ఉపాధ్యక్షులు డాక్టర్ డాకొల్ల ఆంజనేయులు, సుంకురమేష్, ఇమ్రాన్, బండి కృష్ణ, ఏసు, గొల్ల ఎల్లయ్య, దొమ్మాట గ్రామ అధ్యక్షుడు గొల్ల యాదగిరి, పరసరాజు , అన్నా రెడ్డి గారి చంద్రారెడ్డి, తలారి నర్సింలు తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ నగర్ ఫేస్-2లో ఎల్లమ్మ ఆలయంలో అర్ధరాత్రి చోరీ..



వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (నవంబర్ 3)
తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్ ఫేజ్-2లో ఉన్న ఎల్లమ్మ ఆలయంపై అర్ధరాత్రి చోరీ ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో అమ్మవారి చీరలు, ఆలయంలోని పలు వస్తువులు అపహరణకు గురైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కొల్లూరు సీఐ పైదిరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. ఇప్పటికే నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. సీఐ పైదిరెడ్డి మాట్లాడుతూ.. నిందితులు ఎవరైనా, వారికి అండగా ఎవరున్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని తెలిపారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉపాధి హామీ పనుల్లో విషాదం.. కుప్పకూలి కూలీ మృతి



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 3, వుదయం : ఆకారం గ్రామంలో మంగళవారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఓ కూలీ అకస్మాత్తుగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్రబోయిన పోచయ్య రోజులాగే ఉదయం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు హాజరయ్యాడు. తోటి కూలీలతో కలిసి పనిచేస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. తోటి కూలీలు వెంటనే స్పందించి సపర్యలు చేసేలోపే పోచయ్య మృతి చెందాడు. ఎండ తీవ్రత, గుండెపోటు కారణంగా ఆయన మరణించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కుటుంబానికి ఆధారమైన పోచయ్య ఆకస్మిక మృతితో ఆకారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, తగిన ఆర్థిక పరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సంఘాల వినతిపత్రం

నర్సాపూర్, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి):మెదక్ జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, కులవివక్ష ఘటనలను అరికట్టాలని, బోనాలు, బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మెదక్ జిల్లా దళితులపై దాడుల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనితకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ, కేవీపీఎస్ జిల్లా నాయకుడు కడారి నాగరాజు, టీఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కుమార్, జేఎంఎం రాష్ట్ర నాయకుడు ఊరట్ల శివ, మండల అధ్యక్షుడు గోవు యాదగిరి మాట్లాడుతూ.. జిల్లాలోని మనోహరాబాద్ మండలం కోనాయపల్లి, శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడులు జరిగినట్లు ఆరోపించారు.

కుచారం గ్రామంలో దళిత మహిళా సర్పంచ్ ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొనకుండా కులవివక్ష చూపి అవమానించారని పేర్కొన్నారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో బోనాల సందర్భంగా దళితులు ఆలయానికి వెళ్లే దారిని మూసివేసి వివక్ష చూపారని ఆరోపించారు. వెల్దుర్తి మండలం ఎదులపల్లి గ్రామంలో దళిత మహిళా సర్పంచ్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారని, తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో దళిత మహిళలు బతుకమ్మ ఆడినందుకు సాంఘిక బహిష్కరణకు గురిచేశారని తెలిపారు. హవేలీ ఘనపూర్ మండలంలోనూ దళితులపై దాడులు జరిగినట్లు పేర్కొన్నారు.

ఈ ఘటనలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనప్పటికీ విచారణలో జాప్యం జ

సదస్సులో అధికారులకు 14 దరఖాస్తులు అందజేత

పాపన్నపేట మండల పరిధిలోని 5 గ్రామాల రైతులు ప్రజలు దరఖాస్తులు సమర్పించారు



పాపన్నపేట నవంబర్ 3 (వునదయం ప్రతినిధి) :

పాపన్నపేట మండలంలోని నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో వినియోగదారుల సదస్సును అధికారులు మంగళవారం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సదస్సు వేదికగా నిలిచింది. మండల పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలు తమకు సంబంధించిన అంశాలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు. సదస్సు నిర్వహణతో వినియోగదారులు నేరుగా విద్యుత్ శాఖ అధికారులను కలిసే అవకాశం పొందారు. అధికారులకు అందిన దరఖాస్తుల సంఖ్య 14గా నమోదైంది. పాపన్నపేట మండల పరిధిలోని 5 గ్రామాల రైతులు, ప్రజలు ఈ దరఖాస్తులను సమర్పించారు. గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు తమ అవసరాలు, సమస్యలను దరఖాస్తుల రూపంలో అధికారులకు అందించారు. ఒకే వేదికపై పలువురు వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో సదస్సు ప్రధానంగా వినతుల స్వీకరణకు కేంద్రీకృతమైంది. నార్సింగి సబ్‌స్టేషన్ ప్రాంగణం సదస్సుకు వేదికైంది. విద్యుత్ శాఖ పరిధిలోని వినియోగదారులు అక్కడికి చేరుకుని అధికారులకు తమ దరఖాస్తులు అందించారు. పాపన్నపేట మండలంలోని 5 గ్రామాల ప్రజలు ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. రైతులతో పాటు ఇతర ప్రజలు కూడా దరఖాస్తులు సమర్పించారు. గ్రామాల పరిధి నుంచి వచ్చిన వినతులను అధికారులు స్వీకరించారు. పాపన్నపేట మండలంలోని నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో అధికారుల మంగళవారం వినియోగదారుల సదస్సు నిర్వహించారు. సదస్సు కోసం నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణాన్ని ఉపయోగించారు. పాపన్నపేట మండల పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు అక్కడికి వచ్చి తమ దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 14 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందిన దరఖాస్తులు సదస్సులో నమోదైన ప్రధాన అంశంగా నిలిచాయి. సదస్సులో విద్యుత్ శాఖకు చెందిన ఏఈలు పాల్గొన్నారు. సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న నర్సింలు, ఉదయ్ కుమార్, శ్యామ్ సుందర్, నవాజ్, రామామూర్తి కార్యక్రమంలో ఉన్నారు. అధికారుల సమక్షంలో రైతులు, ప్రజలు తమ దరఖాస్తులను అందజేశారు. శాఖాధికారులు హాజరై వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారుల హాజరుతో సదస్సులో విద్యుత్ శాఖ ప్రతినిధుల భాగస్వామ్యం నమోదైంది. నర్సింలు, ఉదయ్ కుమార్, శ్యామ్ సుందర్, నవాజ్, రామామూర్తి సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలుగా సదస్సుకు హాజరయ్యారు. వీరితో పాటు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారుల బృందం ముందే వినియోగదారులు దరఖాస్తులను సమర్పించారు. సదస్సు స్థలం, పరిధి, పాల్గొన్న అధికారుల వివరాలు కార్యక్రమానికి సంబంధించిన ప్రధాన సమాచారం. రైతులు, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు నార్సింగి సబ్‌స్టేషన్ ప్రాంగణంలో స్వీకరించారు. పాపన్నపేట మండలంలోని 5 గ్రామాల పరిధి నుంచి వినియోగదారులు ఈ కార్యక్రమానికి వచ్చారు. 14 దరఖాస్తులు అందడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వినియోగదారుల స్పందన నమోదైంది. సదస్సులో పాల్గొన్నవారు తమ అంశాలను అధికారులకు లిఖితపూర్వకంగా అందించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగిన సదస్సులో ప్రధాన ప్రక్రియగా కొనసాగింది.

సంజీవరెడ్డి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు

కమలాపూర్‌లో మంగళవారం ప్రభుత్వ కేంద్రం



పెద్ద శంకరంపేట: ప్రతినిధి నవంబర్ 03 (వుదయం)

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. పెద్ద శంకరంపేట మండలం కమలాపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

రైతులు మద్దతు ధర పొందేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

దళారులు, వ్యాపారులు చెప్పే మాటలను నమ్మి రైతులు తొందరపడి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించవద్దని సంజీవరెడ్డి కోరారు. ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభించి రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ధాన్యం నిల్వ, తరలింపు కోసం అవసరమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు సత్వర సేవలు అందించాలని సంజీవరెడ్డి ఆదేశించారు. ధాన్యం తూకం విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది సహకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ కేంద్రాల సేవలను వినియోగించుకుని తమ పంటకు నిర్ణయించిన మద్దతు ధర పొందాలని సూచించారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారా గౌడ్, మురళి పంతులు, దాచే సంగమేశ్వర్ సెట్, సర్పంచ్ లా ఫోరం అధ్యక్షుడు పెరమల్ గౌడ్, స్థానిక సర్పంచ్ కుంట్ల రాములు, చిన్న లచ్చన్న గారి సుభాష్, కట్ట శంకర్ పాల్గొన్నారు. వివిధ గ్రామాల నాయకులు, స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సైన్స్ సంబరాలు ప్రారంభం

డిసెంబర్ 11, 12, 13 తేదీల్లో మేడ్చల్ మల్కాజిగిరిలో రాష్ట్ర సంబరాలు



దౌల్తాబాద్ 03 నవంబర్ (వుదయం) మేడ్చల్ మల్కాజిగిరిలో డిసెంబర్ 11, 12, 13 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందని రాయపోల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు.

పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చెకుముకి సైన్స్ సంబరాలు-2026 గోడపత్రికను ఆవిష్కరించారు. ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ సంబరాలు విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తిని పెంచుతాయని తెలిపారు.

కార్యక్రమాలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశీలన శక్తిని అభివృద్ధి చేస్తాయని వివరించారు. ఈ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల, మండల స్థాయిల్లో సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని ఎం.వెంకటేశ్వర్లు కోరారు.

గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఈ సంబరాలపై విద్యార్థులు, పాఠశాలల్లో అవగాహన కల్పించే చర్యగా జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్యం పోటీల షెడ్యూల్‌ను వెల్లడించారు.

బాచారం ఉర్సు వేడుకల్లో పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు

సర్పంచ్ పవిత్ర దుర్గయ్య స్వాగతం



పాపన్నపేట నవంబర్:3 (వుదయం ప్రతినిధి) : మెదక్ జిల్లా మెదక్లోని పాపన్నపేట మండలం బాచారం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉర్సు వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ సొంగ.పవిత్ర దుర్గయ్య ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఉర్సు కార్యక్రమం సందర్భంగా గ్రామంలో మతపెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పద్మాదేవేందర్‌రెడ్డి గ్రామంలోని మహిళలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సయ్యద్ ఏజుదానిహుస్సేన్, కూతుబుహుస్సేన్, జాకీర్ ఆధ్వర్యంలో జరిగిన ఉర్సు వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమ నిర్వహణలో మతపెద్దలు కీలకంగా వ్యవహరించారు. పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా నిర్వహించే పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఉర్సు వేడుకలు భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో మతసామరస్యాన్ని, పరస్పర గౌరవాన్ని చాటిచెబుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పద్మాదేవేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఉర్సు వేడుకలు నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. వేడుకల నిర్వహణలో కనిపించిన సామూహిక భాగస్వామ్యాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్, సర్పంచులు కాశీనాథ్‌రావు, సురేష్, దశరథ్ పాల్గొన్నారు. మాజీ సర్పంచులు గురుమూర్తి, లింగారెడ్డి, మల్లేశం, శ్రీనాథ్, సంగప్ప కూడా హాజరయ్యారు. నాయకులు సీహెచ్. బిక్షపతి, దుర్గయ్య, పోలీస్ లక్ష్మణ్, రాము, జానకి బాలు, జెట్టిగారి కృష్ణ, దత్తు, చారి పాల్గొన్నారు.

రంగధాంపల్లి వార్డులో విద్యార్థి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

తన్నీరు హరీష్ రావు ఆదేశాలతో అంబటి హరీష్ గౌడ్ ఎంపిక



సిద్దిపేట, నవంబర్ 3 (వుదయం బ్యూరో) సిద్దిపేటలోని రంగధాంపల్లి 3వ వార్డులో భారత్ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు, మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావు ఆదేశాలతో కమిటీని పునర్నిర్మించారు. విద్యార్థి విభాగ కమిటీల పునర్నిర్మాణంలో భాగంగా ఈ ఎన్నిక జరిగింది.

రంగధాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి విద్యార్థులు, యువకులు, భారత్ రాష్ట్ర సమితి నాయకులు హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం, తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అంబటి హరీష్ గౌడ్‌ను 3వ వార్డు భారత్ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. బాకూరి శివ, రాజబోయిన ఆంజనేయులు యాదవ్‌లకు ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. కట్ట నాగరాజును ప్రధాన కార్యదర్శిగా, పరికి సాయిరాంను కార్యదర్శిగా ఎంపిక చేశారు.

ఇరేని చరణ్, ఇరేని మహేష్‌లను సంయుక్త కార్యదర్శులుగా నియమించారు. దబ్బేట మహేష్, దబ్బేట ప్రశాంత్‌లు ప్రచార కార్యదర్శులుగా, దబ్బేట సంతోష్ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. దీంతో నూతన కమిటీలో అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఇద్దరు ప్రచార కార్యదర్శులు, ఒక కార్యవర్గ సభ్యుడు ఉన్నారు.

కమిటీ ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను పార్టీ నాయకులు శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో భారత్ రాష్ట్ర సమితి నాయకులు ఐలయ్య యాదవ్, కనకయ్య, శ్రీనివాస్ గౌడ్, గిరియాదవ్, భానుచందర్, మహేందర్ రెడ్డి, హరీష్, మహేందర్ పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఎంపికతో 3వ వార్డు విద్యార్థి విభాగానికి అధ్యక్షుడి నుంచి కార్యవర్గ సభ్యుడి వరకు బాధ్యతలు ఖరారయ్యాయి.

ఏకగ్రీవ ఎన్నికలో విద్యార్థులు, యువకులు, పార్టీ నాయకుల సమక్షంలో పదవుల వారీగా ప్రతినిధులను ప్రకటించారు. రంగధాంపల్లి 3వ వార్డు కమిటీ పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంతో విద్యార్థి విభాగం స్థానిక కార్యవర్గం ప్రకటితమైంది. పార్టీ నాయకులు నూతన ప్రతినిధులను సన్మానించగా, ఎన్నికైన సభ్యుల పేర్లు, వారికి అప్పగించిన బాధ్యతలు వెల్లడయ్యాయి.

శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణంలో ప్రతాప్ రెడ్డి దంపతులు

గౌడ సంఘం ఆధ్వర్యంలో సిద్ధిపేట జిల్లా ఇటిక్యాలలో వేడుక



సిద్ధిపేట, నవంబర్ 3 (వుదయం బ్యూరో)


సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేడుకకు గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వంటేరు ప్రతాప్ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గౌడ సంఘం కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, జగన్మాత శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని కోరినట్లు చెప్పారు. ఇటిక్యాల గౌడ సంఘం సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఇటిక్యాల గ్రామ సర్పంచ్ దీన రాజలింగం, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల నరేష్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు జానకి రాములు, మల్లేష్, స్వామి, భాస్కర్, ఆంజనేయులు, సాయిలు కూడా హాజరయ్యారు.

ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్న సౌజన్య

ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని సౌజన్య కంది తెలిపారు



కంది వుదయం: ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయం, సమస్యలను తెలుసుకునేందుకు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య కంది కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. జైలులోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆమె ఖైదీలతో నేరుగా మాట్లాడారు. ఆహారం, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతులపై ఖైదీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని సౌజన్య కంది తెలిపారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఖైదీలకు సూచించారు. ఖైదీలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఖైదీలలో చట్టాలపై అవగాహన పెంచాలని, జైలు నుంచి విడుదలైన తర్వాత సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మరికల్ సబ్‌స్టేషన్ వద్ద యువకుడికి విద్యుత్ షాక్ తగిలింది

- మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్ తగిలింది
- లాలనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి
- ఘటన రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది
- 108 అంబులెన్స్‌లో తరలింపు జరిగింది
- లాలనే యువకుడికి విద్యుత్ షాక్
- రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదం
- మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- మరికల్ ఏఎస్ఐ చర్యలు చేపట్టారు
- యువకుడికి విద్యుత్ షాక్ తగిలింది
- ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు





మరికల్ నవంబర్ 3 వుదయం ప్రతినిధి మంగళవారం సాయంత్రం జోగులాంబ గద్వాల జిల్లా మరికల్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఓ యువకుడికి విద్యుత్ షాక్ తగిలింది. ఎర్రవల్లి గ్రామానికి చెందిన లాలనే యువకుడు షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదం జరిగిన ప్రదేశం మరికల్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌గా గుర్తించారు. గాయపడిన యువకుడి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో స్థానికంగా వెంటనే వైద్యసాయం అందించాల్సి వచ్చింది. మరికల్ ఏఎస్ఐ మహమ్మద్ గఫూర్ ఘటనపై స్పందించి, గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు. పోలీసుల సమక్షంలో యువకుడిని 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ షాక్ వల్ల యువకుడికి బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ప్రమాదానికి సంబంధించిన ఇతర వివరాలు మూలంలో వెల్లడికాలేదు. ఘటనకు సంబంధించిన ప్రధాన అంశాలు మరికల్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకున్నాయి.

గజ్వేల్ చేరిన బీఆర్ఎస్ సైకిల్ యాత్రకు ఘన స్వాగతం



గజ్వేల్, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి) గజ్వేల్‌లో మంగళవారం మహా సైకిల్ యాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, రేవంత్ రెడ్డి పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలగాలని ఆకాంక్షిస్తూ మేడిగడ్డ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర గజ్వేల్ నియోజకవర్గానికి చేరుకుంది. గోదావరిఖనికి చెందిన మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో 15 మంది సభ్యులు దాదాపు 380 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి యాత్రికులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని ఆయన అన్నారు. సాగునీరు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసేలా అసమర్థ పాలన సాగుతోందని వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించి, ఢిల్లీకి మూటలు పంపడంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమగ్నమయ్యారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ ఎడారిని తలపిస్తోందన్న వంటేరు వ్యాఖ్యలు యాత్ర ఉద్దేశాన్ని, పాలనపై బీఆర్ఎస్ విమర్శలను స్పష్టం చేశాయి. కేసీఆర్ హయాంలో లభించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను తెలంగాణలోని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని వంటేరు తెలిపారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టులతో మండుటెండల్లోనూ సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలతో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారని చెప్పారు. మేడిగడ్డ వద్ద కన్నేపల్లి పంపులను ప్రారంభించి, ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని వంటేరు ప్రభుత్వం ముందు డిమాండ్ చేశారు. సాగునీటి వనరులు, విద్యుత్, రైతుల ఆర్థిక ఇబ్బందులపై ఆయన ప్రస్తావించిన అంశాలే యాత్రలో ప్రధానంగా వినిపించాయి.

బీఆర్ఎస్ పాలనతో ప్రస్తుత పాలనను పోల్చుతూ ఆయన తన రాజకీయ విమర్శలను కొనసాగించారు. మహా సైకిల్ యాత్ర బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కేసీఆర్ నివాసానికి చేరుకుంటుందని వంటేరు తెలిపారు. దాదాపు 400 కిలోమీటర్ల ఈ ప్రయాణంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, వారి అనుభవాలను కేసీఆర్‌కు వివరిస్తామని చెప్పారు. యాత్రకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగ్‌రావు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్, మున్నె రూపా వెంకటేష్, మరికంటి భాగ్యలక్ష్మి కనకసేన పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు అహ్మద్, ఉప్పు రాజ్‌కుమార్, లక్ష్మణ్ గౌడ్, కాసుపాక వాసు, సర్వేష్, అనిల్, కుమార్, నవీన్, శ్రీను, రాకేష్ తదితరులు కూడా ఉన్నారు.

పర్యాటక అభివృద్ధికి కమలాపురం చెరువుపై ఎమ్మెల్యే సూచనలు చేశారు



మనూరు నవంబర్ 2 (వుదయం) : నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి పర్యాటక శాఖ అధికారులతో కలిసి మనూరు కమలాపురం చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. కమలాపురం చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సూచించారు. పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు చెరువు పరిసరాలను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు బనాపురం రాజు ముదిరాజ్, షారుక్ ఖాన్, సుబూర్, మొహీద్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో గంజాయి వాడకంపై టౌన్ పోలీసులు నిఘా పెంచారు



తాండూరు అక్టోబర్ 3(వుదయం ప్రతినిధి)

తాండూరు పట్టణంలో గంజాయి వినియోగంపై టౌన్ పోలీసులు నిఘా పెంచినట్లు సమాచారం. గంజాయి వాడుతున్నట్లు అనుమానిస్తున్న సుమారు 25 మందిని పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై పోలీసులు గోప్యంగా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. గంజాయి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది, ఏ రాష్ట్రం నుంచి పట్టణానికి చేరుతోంది, సరఫరా వెనుక ఎవరున్నారు అనే కోణాల్లో ఆరా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

పాఠశాల భోజనంలో బల్లి కలకలం

ఛతరపుర్ జిల్లాలోని సోరఖీ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో బల్లి కనిపించింది. సిద్ధం చేసిన భోజనంలో బల్లి ఉండటంతో పిల్లల ఆహార నాణ్యత, భద్రతపై ప్రశ్నలు తలెత్తాయి. ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పాఠశాలలో పిల్లలకు భోజనం వడ్డిస్తున్న సమయంలో బల్లి కనిపించడంతో ప్రాంగణంలో కలకలం రేగింది.

జగదేవ్‌పూర్ రైతు వేదికల్లో 113 ప్రత్యక్ష ప్రసారం

సిద్దిపేట/జగదేవపూర్ నవంబర్ 03 వుదయం ప్రతినిధి

జగదేవ్‌పూర్ మండలంలోని జగదేవ్‌పూర్, మునిగడప రైతు వేదికల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ నిర్వహించిన ప్రత్యేక 'రైతు నేస్తం' ఎపిసోడ్ 113 ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం రైతులకు చూపించారు. వ్యవసాయ శాఖ అధికారులు, జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఏర్పడుతున్న ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగి, భూగర్భ జలమట్టాలు పడిపోయే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిమట్టం తగ్గే అవకాశం ఉన్నా వరి, ఇతర పంటల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు తెలిపారు. ఎల్ నినో పరిస్థితిని ఎదుర్కొనేందుకు తక్కువ నీటితో, తక్కువ కాలంలో అధిక దిగుబడి ఇచ్చే యాసంగి



పంటలు సాగు చేస్తే నీటి ఎద్దడి వచ్చినా పంట నష్టం తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతు వేదికల్లో పురుగుమందులను సురక్షితంగా పిచికారీ చేసే విధానం, పిచికారీ సమయంలో రక్షణ దుస్తులు, పీపీఈ కిట్లు ధరించాల్సిన కారణాలను కూడా వివరించారు. మామిడి తోటల్లో పూత నిలవడానికి, కాయలు నాణ్యంగా పెరగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంతో విజయవంతమైన రైతుల అనుభవాలను కార్యక్రమంలో పంచుకున్నారు. రైతులు అడిగిన వివిధ సందేహాలకు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ముందస్తు పంటల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, అధికారులు సూచించిన చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలతోపాటు పశుగ్రాస మోతాదులోనే మందులు వాడాలని యు. వసంతరావు కోరారు.

ఇసుక తరలింపు ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)

నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన రాము అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. దుందుభి వాగు నుంచి తెలకపల్లికి ఇసుక తరలిస్తున్న సమయంలో వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను జరిమానా విధించేందుకు తహసీల్దార్ వద్దకు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

భారీ వర్షాల ముప్పుతో విద్యుత్ సిబ్బంది అప్రమత్తత

నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి):

నాగర్‌కర్నూల్‌లో రానున్న నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎర్ర నర్సింహారెడ్డి సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. 11 కేవీ, ఎల్‌టీ లైన్లు, డీటీఆర్‌లు, సబ్‌స్టేషన్లను నిరంతరం పర్యవేక్షించాలని, అంతరాయాలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

ఎస్ఐ శ్రీనివాస్ ప్రత్యక్ష పర్యవేక్షణ
పోలీసులు మెరుపుదాడులు చేశారు

గద్వాల నవంబర్ 03 (వుదయం బ్యూరో)

జోగులాంబ గద్వాల పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ మద్యపానంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. తనిఖీలు చేపట్టాయి. పాన్ షాపులు, అడ్డా కేంద్రాలు, అర్ధరాత్రి వరకు తెరిచి ఉండే దుకాణాలు, నిర్మానుష్య ప్రదేశాల్లోని మద్యం సేవించే స్థావరాలపై



పట్టణ ఎస్ఐ కే. శ్రీనివాస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఈ బృందాలు నిఘా పెట్టాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ స్థాయిలో తనిఖీలు సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై, నిషేధిత పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. బహిరంగంగా మద్యం సేవించి ప్రజలను, ముఖ్యంగా మహిళలు మరియు కాలేజీ విద్యార్థినులను ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం ఈ చర్యలు చేపట్టింది. గుట్టుచప్పుడు కాకుండా సాగే అక్రమ కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో రచ్చ చేసే ఆకతాయిలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ప్రశాంత వాతావరణాన్ని భంగపరిచే చిన్న ప్రయత్నాన్నైనా అణచివేస్తామని ఎస్ఐ కే. శ్రీనివాస్ స్పష్టం చేశారు.

నాగర్‌కర్నూల్ విద్యుత్ సర్కిల్‌లో వినియోగదారుల సమస్యలను అధికారులు స్వీకరించారు



నాగర్‌కర్నూల్ విద్యుత్ సర్కిల్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలతో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వినియోగదారులు, రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధిక విద్యుత్ బిల్లులు, పంట పొలాలకు సరఫరాలో అంతరాయాలు, పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యలను వారు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారుల సమస్యలను అధికారులు శ్రద్ధగా విని, వాటి స్వభావాన్ని పరిశీలించారు. వినియోగదారులు తెలిపిన సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలకు డిమాండ్

తాండూర్, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి):

తాండూర్‌లో ప్రైవేట్ పాఠశాలలు పదో తరగతి విద్యార్థులకు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 7:30 వరకు తరగతులు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. చదువు పేరుతో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను విస్మరిస్తున్నారని ఏబీవీపీ ఆరోపించింది.

మిషన్ భగీరథ ప్రయోగశాల ఎన్ఏబీఎల్ ఆడిట్ విజయవంతంగా పూర్తి చేసింది



గద్వాల నవంబర్ 03 (వుదయం కరస్పాండెంట్)

జోగులాంబ గద్వాల మిషన్ భగీరథ జిల్లా నీటి విశ్లేషణ ప్రయోగశాల తాగునీటి నాణ్యత నిర్ధారణలో ఉత్తమ ప్రమాణాలు చాటుకుంది. జాతీయ గుర్తింపు సంస్థ 'ఎన్ఏబీఎల్' సమగ్ర ఆడిట్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐడీఓసీ ప్రాంగణంలోని ప్రయోగశాలలో మంగళవారం ఆడిట్ సాగింది. ఆడిటర్ డాక్టర్ కేబీ మంజూరన్ నీటి నమూనాల సేకరణ, విశ్లేషణ విధానాలు, పరికరాల కచ్చితత్వం, రికార్డులను తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్ ఆసుపత్రి విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు



మహబూబ్‌నగర్: నవంబర్ 3, వుదయం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, కిచెన్‌లో తయారవుతున్న ఆహారం నాణ్యత, నవజాత శిశువుల సంరక్షణ విభాగం, సదరం శిబిరం నిర్వహణ తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు మధుసూదన్ నాయక్ సూచించారు. ఆసుపత్రి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచి, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన స్పష్టం చేశారు.

డైవర్షన్ రాజకీయాలు ఆపి హామీలు నిలబెట్టాలని భాస్కర్ నాయక్ డిమాండ్



జడ్చర్ల: నవంబర్ 3, వుదయం

జడ్చర్లలో డైవర్షన్ రాజకీయాలు సాగవని స్వచ్ఛంద సేవకుడు జర్పుల భాస్కర్ నాయక్ స్పష్టం చేశారు. హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న నాయకులను రాబోయే ఎన్నికల్లో ప్రజలు నిలదీస్తారని హెచ్చరించారు. నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి, తాగునీటి సమస్యలను పట్టించుకోకుండా ఒక ఆసుపత్రి చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మూడు ఎకరాల స్థలం ఇస్తామన్న హామీని నిలబెట్టాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణానికి పంపిన 30 టిప్పర్ల మట్టితో కాంట్రాక్టర్ ₹10 లక్షల పని చేసి, ₹70 లక్షల బిల్లులు పెట్టుకున్నారని భాస్కర్ నాయక్ ఆరోపించారు. ఆ సమస్యతో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

బాలానగర్‌లో 513 పెట్టెల బాణసంచా స్వాధీనం



బాలానగర్: నవంబర్ 3, వుదయం

బాలానగర్ మండలం మౌలిమనోహర్ శివారులోని డెయిరీ ఫామ్‌హౌస్‌లో పోలీసులు భారీగా అక్రమ బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో 513 బాణసంచా పెట్టెలు పట్టుబడ్డాయి. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అనుమతులు లేకుండా బాణసంచాను నిల్వ ఉంచినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. పోలీసులు రెండు డీసీఎం వాహనాలను సీజ్ చేసి, సంతోష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. శివకాశి నుంచి బాణసంచాను తీసుకొచ్చి అక్కడ నిల్వ ఉంచినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై ఎస్సై నరేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు, వ్యాపార నిర్వహణపై పోలీసులు చర్యలు ప్రారంభించారు.

మీజిల్స్‌తో న్యూయార్క్‌లో తొలి చిన్నారి మృతి

న్యూయార్క్‌లోని గ్రామీణ ఉత్తర ప్రాంతంలో మీజిల్స్ సోకిన ఓ చిన్నారి మరణించింది. 30 ఏళ్లలో రాష్ట్రంలో ఈ వ్యాధితో నమోదైన తొలి మరణమని అధికారులు సోమవారం తెలిపారు. లూయిస్ కౌంటీలో, సిరాక్యూస్‌కు ఉత్తరంగా 93 మైళ్లు (150 కి.మీ.) దూరంలో ఈ మరణం సంభవించిందని గవర్నర్ క్యాథీ హోకుల్ చెప్పారు. మీజిల్స్ అత్యంత అంటువ్యాధి; సుమారు 1,000 కేసులకు ఒకటి నుంచి మూడు మరణాలు సంభవిస్తాయి. అమెరికాలో టీకాల శాతం 95% అవసరమైన స్థాయికంటే దిగువకు పడిపోయింది. సీడీసీ ప్రకారం, 2026లో అక్టోబర్ చివరికి దేశవ్యాప్తంగా 4,588 కేసులు నమోదయ్యాయి. పెన్సిల్వేనియాలో అదే రోజుకు 1,338 కేసులు నమోదయ్యాయి.

పట్టభద్రుల ఓటు నమోదు చేయాలి

తాండూరు,నవంబర్ 03(వుదయం ప్రతినిధి)

హైదరాబాద్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల ఉపాధ్యాయులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ మండలాల్లో నవంబర్ 6లోపు అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలని ఆయన కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. శ్రీశైల్ రెడ్డి పంజుగుల బషీరాబాద్ మండలంలోని హైస్కూల్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించారు. తాండూరు మండలంలో మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, మైనారిటీ సంక్షేమ పాఠశాల, గిరిజన సంక్షేమ పాఠశాల, పాఠశాలల కాంప్లెక్స్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ప్రతి ఆరేళ్లకోసారి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని శ్రీశైల్ రెడ్డి వివరించారు. గతంలో నమోదు చేసుకున్నవారు కూడా మళ్లీ దరఖాస్తు చేయాలని సూచించారు. 2023 నవంబర్ 1వ తేదీకి ముందు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఈ నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, నవంబర్ 6 గడువు అని శ్రీశైల్ రెడ్డి తెలిపారు.

సర్వర్ సమస్యలతో నమోదు ప్రక్రియలో కొంత జాప్యం జరుగుతోందని చెప్పారు. గడువు పొడిగించే అవకాశం ఉందనే సమాచారం ఉన్నప్పటికీ, అధికారిక ప్రకటన వచ్చే వరకు నవంబర్ 6లోపే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు ముందుండి అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని శ్రీశైల్



రెడ్డి విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పరిచయస్తుల్లోని అర్హులకు సమాచారం చేరవేయాలని సూచించారు. కుటుంబంలో ఒక్కరు నమోదు చేసుకోవడంతో ఆగకుండా, తెలిసిన ప్రతి అర్హుడినీ నమోదు చేయించాలని చెప్పారు. పనుల ఒత్తిడితో నమోదు కేంద్రాలకు రాలేని పట్టభద్రులు ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫోటో సిద్ధంగా ఉంచుకోవాలని శ్రీశైల్ రెడ్డి తెలిపారు. అలాంటి దరఖాస్తుదారులకు పాఠశాలల వద్దే ఓటరు నమోదులో సహకరించేందుకు తమ బృందం వస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తే పట్టభద్రుల్లో నమోదు పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మండల అధ్యక్షుడు పంజుగుల నర్సిరెడ్డి, యువజన అధ్యక్షుడు తహేర్ బాండ్, తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెంగోల్ రాకేష్ గౌడ్ పాల్గొన్నారు. రెండు మండలాలకు చెందిన సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సమావేశాల్లో ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తర్వాత హటా పాఠశాలలో 45 మంది పిల్లలు అస్వస్థత

ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల నుంచి మొత్తం 45 మంది పిల్లలు పర్యవేక్షణలో ఉన్నారు. వారందరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పరిశీలిస్తున్నారు. ఘటనతో మధ్యాహ్న భోజన నాణ్యత తనిఖీ వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తాయి.

పిల్లలు అస్వస్థతతో కలెక్టర్ ఏకత సమూహాన్ని తొలగించారు

విశేష నివేదిక ఘటన తీవ్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ రజనీ సింగ్ ప్రాథమిక సమాచారంలో పాత పిండిని ఉపయోగించిన విషయం బయటపడిందని చెప్పారు. భోజనంలో అసాధారణమైన రుచి ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి వచ్చి ఉండకపోవచ్చని ఆమె పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ఏకత స్వసహాయ సమూహంపై చర్యలు ప్రారంభమయ్యాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే ముందు నాణ్యత, రుచి పరిశీలన ఏ స్థాయిలో జరిగిందన్న అంశం ఇప్పుడు విచారణలో ఉంది. భోజనం తయారీ నుంచి పిల్లలకు వడ్డించే వరకు అమలైన తనిఖీ విధానాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లల జాబితాను అధికారులు సిద్ధం చేశారు.

రెండు రోజుల పాత పిండితో పూరీలు తయారు

మధ్యాహ్న భోజనం చేసిన కొద్దిసేపటికే హటా గ్రామంలోని సమనాపూర్ డాంగీధానా ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో 45 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటలకు పిల్లలు భోజనం ప్రారంభించారు. పాఠశాలలో వారికి ఖీర్, పూరీలు వడ్డించారు. పూరీల రుచి వింతగా అనిపించడంతో పిల్లలు ప్రధానోపాధ్యాయుడు గణేశ్‌దత్ బాదల్‌కు చెప్పారు. ఆయన పూరీలు రుచి చూడగా పుల్లటి రుచి, దుర్వాసన కనిపించాయి. కొద్దిసేపటికే పిల్లలకు కడుపునొప్పి, వాంతులు మొదలయ్యాయి. అందరినీ జిల్లా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఏకత స్వసహాయ సమూహం గ్రామంలోని ఒక కార్యక్రమం నుంచి తెచ్చిన 2 రోజుల క్రితం కలిపిన పిండితో పూరీలు తయారు చేసిందన్న ఆరోపణలు వచ్చాయి. ప్రధానోపాధ్యాయుడు సమూహ సభ్యులను ప్రశ్నించినా, వారు తప్పును అంగీకరించలేదని సమాచారం. అనంతరం పాఠశాల అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అందుబాటులో ఉన్న వాహనాలు, అంబులెన్స్ సహాయంతో పిల్లలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందిన తరువాత కలెక్టర్ రజనీ సింగ్, ఎస్పీ డాక్టర్ బుషికేశ్ మీనా ఆసుపత్రికి చేరుకుని పిల్లల చికిత్స వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. వైద్యుల ప్రకారం 45 మంది పిల్లల పరిస్థితి సాధారణంగానే ఉంది, ప్రస్తుతం వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

తనిఖీలో లోపాలతో మహావీర్ స్వీట్స్ కర్మాగార లైసెన్స్ సస్పెండ్

ముఖ్య ప్రతినిధి అశోకనగర్‌లోని స్టేషన్ రోడ్‌లో ఉన్న మహావీర్ స్వీట్స్ కర్మాగారంలో ఆహార భద్రత, రెవెన్యూ శాఖల బృందాలు సంయుక్తంగా తనిఖీ చేసి, తయారీపై నిషేధం విధించాయి. ఆహారంలో చనిపోయిన పురుగు కనిపించిందన్న ఫిర్యాదుపై సాకేత్ మాల్వియా ఆదేశాలతో ఈ చర్య చేపట్టారు. తనిఖీలో భారీ అవకతవకలు, పరిశుభ్రత లోపం బయటపడ్డాయి. మిఠాయిలను బహిరంగంగా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. అనువిభాగీయ అధికారి రెవెన్యూ అశోకనగర్ ఇన్సార్ ఖాన్ మార్గదర్శకత్వంలో బృందం కాజూ ముక్కలు, మావా బర్ఫీ, మోతీచూర్ లడ్డూ, మావా నమూనాలను సేకరించింది. అనారోగ్యకర పరిస్థితుల్లో మిఠాయిల తయారీ, నిల్వ జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 కింద చర్యలు ప్రారంభించారు. కర్మాగారంలో కనిపించిన లోపాలను వ్యాపారి సరిదిద్ది, పరిష్కరించే వరకు మిఠాయిల తయారీని తదుపరి ఆదేశాల వరకు నిలిపివేశారు. ఈ నిర్ణయంతో మహావీర్ స్వీట్స్ కర్మాగారం ఆహార లైసెన్స్ సస్పెండ్ అయింది. నమూనాల పరీక్ష ఫలితాలు లేదా తదుపరి ఆదేశాల వివరాలను మూల సమాచారం వెల్లడించలేదు. మహావీర్ స్వీట్స్‌లో గతంలోనూ అవకతవకలు గుర్తించడంతో రూ.50,000 జరిమానా విధించారు. ఆ కేసులో 50000 రూపాయల జరిమానా ఇప్పటికే విధించారు.

అలవాటుగా మారే మందుల అక్రమ విక్రయంపై 138 షాపుల లైసెన్సులు సస్పెండ్

విశేష నివేదిక హైదరాబాద్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 138 మెడికల్ షాపుల లైసెన్సులను తెలంగాణ ఆహార, అత్యవసర ఔషధాల ప్రమాణాల ప్రాధికార సంస్థ (టీజీ సేఫ్) సస్పెండ్ చేసింది. అలవాటుగా మారే మందుల అక్రమ విక్రయాలు, మళ్లింపును అడ్డుకునేందుకు ఈ చర్య తీసుకుంది. టీజీ సేఫ్ ఔషధ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసుల సమన్వయంతో అక్టోబర్ 15న రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఆ తనిఖీల ఆధారంగా లైసెన్సులపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొత్తం 138 సంస్థలపై చర్యలు తీసుకోగా, 98 మెడికల్ షాపులపై తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుంది. మరో 40 షాపుల లైసెన్సులను నిర్దిష్ట కాలానికి నిలిపివేశారు. ఇంకా రెండు సంస్థలకు హెచ్చరికలు జారీ చేయడంతో మొత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల సంఖ్య 140కి చేరింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం, 1940 నిబంధనలతో పాటు అలవాటుగా మారే మందుల విక్రయ నియమాలను సంస్థలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండా అలవాటుగా మారే మందులను విక్రయించరాదని టీజీ సేఫ్ కెమిస్టులు, డ్రగ్గిస్టులను హెచ్చరించింది. నమోదిత వైద్యులు జారీ చేసిన ప్రిస్క్రిప్షన్లకే విక్రయాలను పరిమితం చేయాలని స్పష్టం చేసింది. మానసిక ప్రభావం కలిగించే మందులు, షెడ్యూల్ హెచ్, హెచ్1 ఔషధాలు కూడా ఈ నియమానికి లోబడి ఉంటాయని సంస్థ తెలిపింది. అలాంటి మందులను నమోదిత ఫార్మసిస్ట్ లేకుండా పంపిణీ చేయకూడదని పేర్కొంది. లైసెన్సు సస్పెన్షన్‌లు, హెచ్చరికలతో కూడిన చర్యలు అక్రమ విక్రయాలపై అమలైన తాజా నియంత్రణగా నిలిచాయి. నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన సంస్థలపై తీసుకున్న చర్యల్లో తదుపరి ఉత్తర్వుల వరకు కొనసాగనున్న సస్పెన్షన్ కూడా ఉంది.

విద్యార్థులకు ఆవిష్కరణలపై ప్రేరణాత్మక తరగతులు

వెల్దుర్తి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి):

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతుల విద్యార్థుల కోసం ఆవిష్కరణలు, వ్యవస్థాపక దృక్పథంపై ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు. గ్రామీణ విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలపై ఆసక్తిని పెంచడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల స్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను ఆలోచించేలా విద్యార్థులను ప్రోత్సహించారు. పీఎం శ్రీ పాఠశాలల డైస్ కార్యక్రమంలో భాగంగా బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరిగాయి. నర్సాపూర్‌లోని ఆ సంస్థ కార్యక్రమాన్ని నిర్వహించింది. సుమారు 150 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఆవిష్కరణలు, వ్యవస్థాపక ఆలోచనలను పరిచయం చేయడం ద్వారా విద్యార్థుల ఆసక్తిని ఆచరణాత్మక సమస్యల వైపు మళ్లించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. పి. చంద్రబాబు, డా. కె. శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆలోచన, కృషి, పట్టుదలతో నిజజీవిత సమస్యలకు పరిష్కారాలు చూపిన తెలుగు విజేతల విజయగాథలను వివరించారు. విజయానికి కొత్త ఆలోచన ఒక్కటే కాకుండా దాన్ని ఆచరణలో పెట్టే శ్రమ, నిరంతర పట్టుదల కూడా అవసరమని వారి ఉదాహరణల ద్వారా వివరించారు. విద్యార్థులు తమ గ్రామంలో, పాఠశాలలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటికి సులభమైన పరిష్కారాలను అన్వేషించాలని అధ్యాపకులు సూచించారు. రోజువారీ జీవితంలో కనిపించే సమస్యలను పరిశీలించడం, వాటిపై చర్చించడం, సాధ్యమైన మార్గాలను పరీక్షించడం ద్వారా సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. ఉత్సుకత, ఆత్మవిశ్వాసం, వ్యవస్థాపక లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రోత్సహించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, భవిష్యత్తులో ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఆ దిశగా ఆలోచనలను కార్యాచరణగా మార్చడం, స్థానిక అవసరాలకు సరిపోయే పరిష్కారాలను వెతకడం ముఖ్యమని తరగతుల్లో వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు తమ చుట్టూ ఉన్న సమస్యలే ఆవిష్కరణలకు ఆధారాలుగా మారవచ్చని కార్యక్రమం ద్వారా తెలియజేశారు. చర్చలు, వివిధ కార్యకలాపాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రశ్నలు, అభిప్రాయాల మార్పిడి, కార్యకలాపాల ద్వారా ఆవిష్కరణలపై తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించడం నుంచి పరిష్కారాన్ని ఆలోచించడం వరకు జరిగే ప్రక్రియను తరగతుల సందర్భంగా అర్థం చేసుకున్నారు. కార్యక్రమం విద్యార్థుల భాగస్వామ్యంతో కొనసాగింది. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన విద్యా మంత్రిత్వ శాఖ, పాఠశాల యాజమాన్యం, బీవీఆర్ఐటీ నర్సాపూర్ ప్రిన్సిపాల్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సాంబయ్య, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల డైస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ తరగతులతో 8, 9వ తరగతుల విద్యార్థులకు ఆవిష్కరణలు, వ్యవస్థాపక దృక్పథంపై అవగాహన కల్పించారు.



అచ్చంపేటలో నాలుగు విద్యాసంస్థల్లో యువతకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు

అటవీ శాఖ, అపోలో ఫౌండేషన్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు

అచ్చంపేట, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి) :

దౌల్తాబాద్ నవంబర్ 03(వుదయం): నవంబర్ 12న పాఠశాల స్థాయిలో ప్రారంభమయ్యే చెకుముకి సైన్స్ సంబరాలు-2026ను విజయవంతం చేయడానికి అన్ని పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు కోరారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిల వరకు సంబరాలు కొనసాగనున్నాయి. కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచడం, సృజనాత్మకతను వెలికితీయడం, పరిశీలనా శక్తిని మెరుగుపరచడం, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేయడమేనని కనకరాజు తెలిపారు. గోడపత్రిక ఆవిష్కరణ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడానికి అవసరమైన పునాది ఏర్పడుతుందని చెప్పారు. సైన్స్‌పై అవగాహన పెరిగితే ప్రశ్నించే స్వభావం, విషయాలను పరిశీలించే అలవాటు, ఆధారాలతో ఆలోచించే నైపుణ్యం అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థులకు తమ ఆలోచనలు, ప్రయోగాత్మక ఆసక్తి, సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పిస్తాయని వివరించారు. పాఠశాలలలో ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని బలోపేతం చేయవచ్చని అన్నారు. జన విజ్ఞాన వేదిక గత 37 సంవత్సరాలుగా సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు చేస్తున్న కృషిని కనకరాజు అభినందించారు. సైన్స్‌ను ప్రజలకు చేరువ చేయడానికి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థులతో పాటు సమాజంలోని ఇతర వర్గాల్లోనూ అవగాహన పెంచుతున్నాయని ఆయన అన్నారు. శాస్త్రీయ విషయాలను సులభంగా అర్థమయ్యేలా పరిచయం చేయడం వల్ల సైన్స్ పట్ల ఆసక్తి విస్తరించవచ్చని



పేర్కొన్నారు. చెకుముకి సంబరాలు అదే లక్ష్యంతో విద్యార్థులను పాఠశాల స్థాయిలోనే శాస్త్రీయ కార్యకలాపాల వైపు మళ్లించే వేదికగా ఉపయోగపడతాయని తెలిపారు. సమాజంలో సైన్స్ ప్రచారం విస్తృతంగా జరిగితే మూఢనమ్మకాలు తొలగి ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని కనకరాజు పేర్కొన్నారు. ఆధారపూర్వకమైన ఆలోచనకు ప్రాధాన్యం పెరగడం వల్ల శాస్త్రీయ దృక్పథం సామాజిక జీవితంలోనూ బలపడుతుందని ఆయన అన్నారు. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను పరిశీలన, ప్రశ్నలు, సృజనాత్మక ఆలోచనలతో అనుసంధానించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. సంబరాల్లో పాల్గొనడం ద్వారా ఆచరణాత్మకంగా నేర్చుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నందున అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సహకరించాలని కనకరాజు కోరారు. విద్యార్థులు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా పాఠశాలలు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, యాజమాన్యాల సహకారం ఉంటే సంబరాల ఉద్దేశాలు విద్యార్థులకు మెరుగ్గా చేరుతాయని చెప్పారు. కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పాఠశాలల భాగస్వామ్యం కీలకమని ఆయన స్పష్టం చేశారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధి తుమ్మ సత్యం చెకుముకి సైన్స్ సంబరాల నిర్వహణ షెడ్యూల్‌ను వెల్లడించారు. పాఠశాల స్థాయి కార్యక్రమాలు నవంబర్ 12న, మండల స్థాయి కార్యక్రమాలు నవంబర్ 21న నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తొలిదశలోనే తమ సృజనాత్మక ఆలోచనలు, శాస్త్రీయ ఆసక్తిని ప్రదర్శించే అవకాశం పొందుతారని చెప్పారు. అనంతరం మండల స్థాయిలో ఎంపికైన కార్యక్రమాలు, ప్రతిభలు తదుపరి దశకు వెళ్లేలా షెడ్యూల్ రూపొందించినట్లు వివరించారు. జిల్లా స్థాయి కార్యక్రమాలు నవంబర్ 28న నిర్వహించనున్నట్లు సత్యం తెలిపారు. పాఠశాల, మండల స్థాయిల్లో జరిగే కార్యక్రమాల అనంతరం జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి దశలో విద్యార్థులు సైన్స్‌పై తమ అవగాహనను, పరిశీలనా సామర్థ్యాన్ని, సృజనాత్మకతను చూపించాల్సి ఉంటుందని వివరించారు. షెడ్యూల్ ప్రకారం దశలవారీగా కార్యక్రమాలు సాగుతాయని తెలిపారు. డిసెంబర్ 11, 12, 13 తేదీల్లో మేడ్చల్ మల్కాజిగిరిలో తదుపరి స్థాయి సైన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సత్యం వెల్లడించారు. జిల్లా స్థాయి కార్యక్రమాల తరువాత జరిగే ఈ దశకు సంబంధించిన తేదీలను కూడా షెడ్యూల్‌లో ప్రకటించారు. విద్యార్థులు తమ ప్రతిభను మరింత విస్తృత వేదికపై ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమాలు అవకాశం కల్పిస్తాయని ఆయన తెలిపారు. తేదీలను పాఠశాలలు, ఉపాధ్యాయులు గమనించి విద్యార్థుల పాల్గొనడాన్ని సమన్వయం చేయాలని సూచించారు. చెకుముకి సైన్స్ సంబరాల ప్రతి దశలో విద్యార్థుల భాగస్వామ్యమే ప్రధానమని సత్యం చెప్పారు.

రైతు మేళాకు రైతుల తరలింపునకు కలెక్టర్ ఆదేశం

హకీంపేటలో 7 నుంచి 9వ తేదీ వరకు మేళా

నారాయణపేట టౌన్ నవంబర్ 3(వుదయం ప్రతినిధి)



నారాయణపేట జిల్లా నుంచి రైతులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రైతు మేళా నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మేళాకు హాజరుకానున్న నేపథ్యంలో రైతుల రవాణాకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ప్రియాంక జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులను తరలించే ఏర్పాట్లను మండలాల వారీగా చేపట్టాలని, ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను సమన్వయ బాధ్యతల్లో నియమించాలని ఆదేశించారు. ప్రయాణ సౌకర్యం, రవాణా మార్గాలు, భోజన వసతి వంటి అంశాలపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. రైతు మేళాకు వెళ్లే బస్సుల వివరాలను సంబంధిత యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రతి బస్సు బయలుదేరే సమయం, నిర్ణయించిన పికప్ కేంద్రం, ప్రయాణించే రైతుల సంఖ్యను నమోదు చేయాలని సూచించారు. లైజనింగ్ అధికారులు బస్సు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, బస్సులు బయలుదేరినప్పటి నుంచి గమ్యస్థానానికి చేరుకునే వరకు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. మూడు రోజులపాటు అధికారుల బృందాలు అందుబాటులో ఉండి రవాణా, ప్రయాణం, భోజన వసతి ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతు మేళా ఏర్పాట్లలో సమాచార నిర్వహణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రియాంక స్పష్టం చేశారు.

బస్సుల కదలికలు, పికప్ కేంద్రాలు, రైతుల సంఖ్యపై తాజా వివరాలు యాప్‌లో నమోదైతే మండలాల వారీగా ఏర్పాట్లను పర్యవేక్షించవచ్చని అధికారులు తెలిపారు. రవాణా సిబ్బంది, లైజనింగ్ అధికారులు నిరంతరం సమన్వయంతో ఉండాలని సమావేశం సూచించింది. సమీక్షలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ఫణికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ విజయ్ భాస్కర్, డీఆర్డీఓ వెంకట్ రాములు పాల్గొన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుజాత, ఆర్డీఓ మున్నీ, ఆర్అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్య, పీఆర్ ఈఈ అశోక్ కుమార్ కూడా హాజరయ్యారు. హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, డీఈఓ గోవింద రాజులు, డీఎంవో బాలామణి, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. మండలాల వారీగా అధికారుల బాధ్యతలు, బస్సుల వివరాల నమోదు, ప్రయాణికుల పర్యవేక్షణ, మూడు రోజుల కంట్రోల్ పాయింట్ నిర్వహణను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అయిజ అభివృద్ధికి ఆమోదం

రాజోలి ప్లాంట్ నుంచి సరఫరా మెరుగుదలకు ప్రతిపాదన



అయిజ, నవంబర్ 03 వుదయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పురపాలక సంఘం అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో మొత్తం 51 అంశాలను పరిశీలించారు. 39, 45వ అంశాలను తిరస్కరించి మిగిలిన 49 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు రాజోలి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి తాగునీటి సరఫరాను మెరుగుపరిచే పథకానికి రూ.20 కోట్ల ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదించింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వ పాలనా అనుమతులు పొందేందుకు పంపాలని నిర్ణయించింది.

పట్టణ ప్రజలకు నిరంతరాయంగా నీరు అందించడంతోపాటు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రూ.20 లక్షల ముందస్తు చర్యల ప్రతిపాదనకూ ఆమోదం లభించింది. వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాల నిర్వహణ, రోడ్ల మరమ్మతులకు సంబంధించిన పనులకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నిర్ణయించింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. డంపింగ్ యార్డులో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు రూ.25 లక్షల ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదించింది.

చెత్త నిర్వహణను మెరుగుపరిచి పట్టణ పారిశుద్ధ్యాన్ని బలోపేతం చేసే చర్యలకు ఈ నిర్ణయం తోడ్పడనుంది. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య అంశాలపై సమావేశం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకుల తొలగింపు, అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సదుపాయం, వీధి కుక్కల నియంత్రణ, రోడ్ల భద్రతపై సభ్యులు చర్చించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఈ అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

తాగునీటి వసతుల విస్తరణతోపాటు పట్టణ పరిశుభ్రతకు సంబంధించిన పనులను కూడా కొనసాగించాలని కౌన్సిల్ నిర్ణయించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కౌన్సిల్ ఆమోదించిన అభివృద్ధి ప్రతిపాదనల్లో తాగునీటి సరఫరా, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ప్రజారోగ్యానికి సంబంధించిన పనులు ఉన్నాయి. తాగునీటి పథకానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వ పాలనా అనుమతుల కోసం పంపనున్నారు. వేసవి ముందస్తు చర్యలు, మౌలిక సదుపాయాల పనులు, డంపింగ్ యార్డు ప్రాసెసింగ్ ప్లాంట్ విద్యుత్ సదుపాయం కౌన్సిల్ నిర్ణయాల్లో ప్రధానంగా నిలిచాయి.

బాల్యవివాహాలపై అధికారులు గట్టి హెచ్చరిక

బేగంపేట పాఠశాలలో చట్టంపై అవగాహన

దౌల్తాబాద్ నవంబర్ 3 (వుదయం) బాల్యవివాహాలు చిన్నారుల జీవితాలను ఛిద్రం చేస్తాయని బేగంపేట ఎస్ఐ రేణుక, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.రాజు, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సిద్దిపేట జిల్లా కో ఆర్డినేటర్ బండకాడి గణేష్ తెలిపారు. ఆడపిల్లల చదువుకు పెళ్లి అడ్డుగా మారకూడదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, డీసీపీవో ఆదేశాల మేరకు రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాల్యవివాహాల నిర్మూలన చట్టం-2006పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాల్యవివాహాల వల్ల బాలబాలికల బంగారు భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడటమే కాకుండా, వారి ఎదుగుదలకు అవి సంకెళ్లుగా మారుతాయని అధికారులు వివరించారు. అధికారులు 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్యవివాహాలు జరిపించే వారితో పాటు సహకరించే వ్యక్తులు, విషయం తెలిసినా అధికారులకు సమాచారం ఇవ్వని వారు కూడా శిక్షార్హులవుతారని హెచ్చరించారు.



చిన్న వయసులో పెళ్లిళ్లు జరిగితే బాలబాలికలు మానసికంగా, శారీరకంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని, ప్రేమ లేదా పెళ్లి పేరుతో జీవితంలో స్థిరపడకముందే విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, పట్టుదలతో చదివి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిసితే వెంటనే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్యవివాహాలను అడ్డుకోవడంతో పాటు బాధిత బాలబాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించి, వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి అవసరమైన సహాయాన్ని అందిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమం అనంతరం 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' గోడపత్రికను ఆవిష్కరించారు. బాల్యవివాహాల నిర్మూలనపై చట్టపరమైన అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

అక్రమ పరీక్షలు చేస్తే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు

స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణకు అధికారులకు ఆదేశం

గద్వాల నవంబర్ 03 వుదయం కరస్పాండెంట్ జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి అధికారులను ఆదేశించారు. అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డాక్టర్ సంధ్య కిరణ్మయి అధ్యక్షతన, కార్యక్రమాల అధికారి డాక్టర్ ప్రసూన రాణి పర్యవేక్షణలో జిల్లా సలహా సంఘం సమావేశం జరిగింది. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరును సమావేశం సమీక్షించింది. కేంద్రాలకు ఉన్న చట్టబద్ధమైన అనుమతులు, రికార్డుల నిర్వహణ, రిజిస్టర్ల తనిఖీలు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్ట నిబంధనల అమలు తీరును అధికారులు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలు, వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని డాక్టర్ సంధ్య కిరణ్మయి తెలిపారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని, కేంద్రాల అనుమతులు మరియు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. చట్ట అమలులో లోపాలు కనిపిస్తే వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సమావేశం స్పష్టం చేసింది. బాలికల జనన నిష్పత్తిని పరిరక్షించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు



నిర్వహించాలని డాక్టర్ సంధ్య కిరణ్మయి సూచించారు. ఆడపిల్లల పట్ల వివక్షను విడనాడాలని, ఆడపిల్లలు సమాజానికి భారమనే భావనను తొలగించాలని చెప్పారు. స్త్రీ, పురుష సమానత్వంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. బాలికల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, మహిళలు గౌరవప్రదంగా జీవించే పరిస్థితుల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వైద్యులు, అధికారులు, ప్రజలు భాగస్వాములై అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిస్థాయిలో అరికట్టాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సలహా సంఘం సభ్యులు డాక్టర్ స్వప్న, డాక్టర్ శోభారాణి, డాక్టర్ అభినేష్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అజ్గర్ అలీ, కార్యక్రమాల అధికారి డాక్టర్ జి. రాజు, పర్యవేక్షణ అధికారి తిరుమల్ రెడ్డి, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి వరలక్ష్మి, ఇన్‌చార్జి సమాచార అధికారి హీర్య నాయక్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన షేర్ల ర్యాలీతో మార్కెట్ సూచీలు భారీగా పెరిగాయి

బీఎస్ఈ సెన్సెక్స్ 76,917.85 వద్ద స్థిరపడింది



జిల్లా విలేఖరి ముంబైలో మంగళవారం భారత స్టాక్ మార్కెట్ భారీ లాభాలతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలకు తోడు కొనుగోళ్లు పెరగడంతో వారంలోని రెండో ట్రేడింగ్ రోజున సూచీలు దూసుకెళ్లాయి. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ గణనీయమైన లాభాలతో ముగియడంతో మార్కెట్‌లో ఉత్సాహం నెలకొంది. హిందుస్థాన్ యూనిలీవర్, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ వంటి దిగ్గజ షేర్లలో పెరుగుదల ఈ ర్యాలీకి ప్రధాన బలమిచ్చింది. రోజువారీ లావాదేవీలు ముగిసేసరికి 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 1225.07 పాయింట్లు పెరిగి 76,917.85 వద్ద స్థిరపడింది. 50 షేర్ల నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 370.05 పాయింట్లు లాభపడి 23,810.85 వద్ద ముగిసింది. గత సెషన్‌లోనూ దాదాపు 1.5 శాతం పెరుగుదల నమోదవడంతో, పెట్టుబడిదారుల మూలధనం వరుసగా రెండో రోజూ పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 షేర్లు లాభాలతో ముగియగా, 5 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో 39 కంపెనీల షేర్లు పెరగగా, 10 షేర్లు దిగజారాయి; ఒక షేరు మార్పులేకుండా ముగిసింది.

కల్వకుంటలో కాంటాలు మొదలుకాలేదు

రైతులు పంట విక్రయానికి ఎదురుచూడాల్సిన పరిస్థితి

నిజాంపేట , వుదయం ప్రతినిధి : కల్వకుంట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు గడిచినా కాంటాలు మొదలుకాలేదు. దీంతో పంటను అమ్మేందుకు వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రాలు తెరిచినట్లు కనిపిస్తున్నా ధాన్యం తూకాలు మాత్రం నిలిచిపోయాయి. కోతలు పూర్తిచేసుకున్న రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. కొనుగోలు ప్రక్రియ మొదలవుతుందని ఎదురుచూస్తున్నా తూకాలు జరగకపోవడంతో పంటను విక్రయించలేకపోతున్నారు. నిల్వలు, రవాణా ఏర్పాట్ల విషయంలోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. మండల పరిధిలోని రజాక్‌పల్లి సబ్ సెంటర్ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. అక్కడి కేంద్రాన్ని ఇప్పటివరకు



ప్రారంభించకపోవడంతో ఆ ప్రాంత రైతులకు కొనుగోలు సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ఫలితంగా కోసిన ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలన్నది రైతులకు సమస్యగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు కొనసాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కల్వకుంటలో ధాన్యం కాంటాలను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపు ఖాయం

దామరగిద్ద నవంబర్ 3(వుదయం ప్రతినిధి)



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ కోరారు. ఉద్యోగులు, నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్‌కు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పి టీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ కార్యకర్తలు అర్హులైన పట్టభద్రుల ఓటుహక్కు నమోదును ఆన్‌లైన్‌లో పూర్తి చేయించేందుకు పనిచేయాలని శ్రీనివాస్ సూచించారు. హామీలు, పథకాలను అమలు చేయకుండా ప్రజాపాలనపై కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న ప్రకటనలను ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలట్ పేపర్‌తో నిర్వహిస్తే విజయం తమదేనని చెప్పిన కాంగ్రెస్, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయిందని శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. విద్యావంతులు, ఉపాధ్యాయులు కాంగ్రెస్‌కు తగిన సమాధానం చెప్పారని అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయకపోతే తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమని శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతుల ఆగ్రహం కారణంగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతింటుందని అన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై గ్రామగ్రామాన బీఆర్ఎస్ పాదయాత్ర

సంగారెడ్డి వుదయం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. త్వరలో గ్రామగ్రామాన పాదయాత్ర చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన ప్రకటించారు. సమ్మేళనానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న సమస్యలు, అక్రమ అరెస్టులు, వేధింపులు,



అవమానాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చింతా ప్రభాకర్ వారి సమస్యలను విని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రైతులకు సాగునీరు అందించలేని అసమర్థ ప్రభుత్వంగా కాంగ్రెస్ మిగిలిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని చింతా ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకుంటూ అంతర్గత విభేదాలతో కాలం గడుపుతున్నారని, అలాంటి నాయకులు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అధికారంలోకి వస్తే 48 గంటల కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పినా, రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు అందని పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు చింతా ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. కార్యకర్తకు చిన్న ఆపద వచ్చినా, సమస్య ఎదురైనా ఒక్క మిస్ కాల్ చేయాలని, వారి ముందుకు వచ్చి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజకీయ కక్షలకు తావివ్వకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని చింతా ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పుడు అనుసరిస్తున్న విధానాలే భవిష్యత్తులో వారికి ఎదురవుతాయని హెచ్చరించారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని చెప్పారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించే వారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు అధ్యక్షత వహించగా, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సర్పంచులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మైనర్ యువకులకు పొగాకు ఉత్పత్తుల విక్రయాలు

- టీ స్టాల్ పాన్షాపులు, కిరాణా దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం- అధికారుల నిఘా ఏదీ..

" వుదయం పత్రిక" ప్రత్యేక కథనం



చిలుకూరు నవంబర్ 03:(వుదయం)

మండల కేంద్రంలోని పరిసర గ్రామాల్లో టీ స్టాళ్ళు, పాన్షాపులు, కిరాణా దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్కా ఖైని తదితర పొగాకు ఉత్పత్తులు అందుబాటులో ఉండటంతో మైనర్ యువత వాటికి అలవాటు పడుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల యువకులు ఆరోగ్యానికి హానికరమైన ఈ ఉత్పత్తుల విక్రయాలపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

– మైనర్ యువతపై

చిన్న వయసులోనే సరదాగా ప్రారంభమయ్యే పొగాకు వినియోగం క్రమంగా వ్యసనంగా మారుతోంది. స్నేహితుల ప్రభావం, ఆసక్తి, అలవాటు కారణంగా పలువురు యువకులు గుట్కా, ఖైని వంటి ఉత్పత్తులకు బానిస లవు తున్నారు. పొగాకు వినియోగం నోటి క్యాన్సర్ తో పాటు గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరి స్తున్నారు. అయినప్పటికీ విక్రయాలు, వినియోగంపై ఆశించిన స్థాయిలో నియంత్రణ కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– నిబంధనలు ఉన్నా– అమలు ఎక్కడ

పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో వినియోగంపై చట్టపరమైన నిబంధనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నిషేధిత గుట్కా ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల్లో అమ్మకాలు సాగుతున్నాయా? అనే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పొగాకు అలవాటు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాల ఆర్థిక పరిస్థితి పైనా ప్రభావం చూపుతోంది. రోజువారీ సంపాదనలో కొంత మొత్తాన్ని వ్యసనాల కోసం ఖర్చు చేయడం, అనారోగ్య సమస్యలు తలెత్తడంతో కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యువతను ఇలాంటి వ్యసనాల నుంచి దూరం చేయడానికి కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. మండల పరిధిలోని టీ స్టాల్లో పాన్షాపులు, కిరాణా దుకాణాల్లో సంబంధిత అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరు తున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే సరఫరా దారులు, విక్రయదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠ శాలలు, బస్టాండ్ సెంటర్లో పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మైనర్ యువతకు పొగాకు విని యోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలని సూచి స్తున్నారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి. కేవలం హెచ్చరికలకే పరిమితం తీసుకోవాలని కాకుండా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని, స్థానికులు కోరుతున్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పొగాకు ఉత్పత్తుల విచ్చలవిడి విక్రయాలకు అడ్డుకట్ట ఎప్పుడు పడుతుందో వేచి చూడాల్సిందే.

– అధికారులు ఇప్పటికైనా స్పందించాలి

చిలుకూరు మండల లో,టీ స్టాల్, పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో సంబంధిత అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే సరఫరా దారులు, విక్రయ దార్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు, పాఠశాల బస్టాండ్ సెంటర్లో టీ స్టాల్ లో కిరాణా దుకాణాల్లో,పరిసరాలో ప్రత్యేక నిఘ ఏర్పాటు చేసి మైనర్ యువతకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తున్నారు, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి, కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా నిబంధనలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు కోరుతున్నారు, మైనర్ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పొగాకు ఉత్పత్తుల విచ్చలవిడిగా విక్రయాలకు అడ్డుకట్ట ఎప్పుడు పడుతుందో వేచి చూడాల్సిందే.

రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరిపై కేసు నమోదు



సత్తుపల్లి నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)

రహదారులపై వరి ధాన్యం ఆరబోసి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే ఎట్టి పరిస్థితిలో వదిలేది లేదంటూ సత్తుపల్లి పోలీసులు హెచ్చరించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని , ఇలాంటి సంఘటనకు కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు . ఈనెల 1న సదాశివునిపాలెం గ్రామానికి చెందిన గాయం రాము, చాట్ల లక్ష్మి అనే ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ రహదారిపై వరి ధాన్యం ఆరబోశారు. అదే సమయంలో తుంబూరు గ్రామానికి చెందిన తురకా రాంబాబు మోటార్ సైకిల్పై అటుగా వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు రోడ్డుపై ధాన్యం ఆరబోసి ప్రమాదానికి కారణమైన గాయం రాము, చాట్ల లక్ష్మిపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్హెచ్ఓ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు.కొంతమంది రైతులు రహదారులపై ధాన్యం ఆరబోయడమే కాకుండా, వాహనాలు ధాన్యంపైకి రాకుండా రోడ్ల మధ్యలో పెద్ద పెద్ద రాళ్లు, ముళ్లకంచెలు, కట్టెలు ఏర్పాటు చేస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు తమ పంటను ప్రభుత్వ రహదారులపై కాకుండా ప్రభుత్వం కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పిపిసిలు) లేదా గ్రామాల్లోని ప్రత్యామ్నాయ కల్లాల్లో మాత్రమే ఆరబెట్టుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, ఇందుకు ధాన్యం యజమానులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్హెచ్ఓ తుమ్మలపల్లి శ్రీహరి హెచ్చరించారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల పాటల పోటీలో సూర్యాపేట మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ ఉపేంద్రాచారి ప్రథమ స్థానం



సూర్యాపేట, నవంబర్ 03: వుదయం ప్రతినిధి

ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి పాటల పోటీలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో సూర్యాపేట మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ జి. ఉపేంద్రాచారి(జూనియర్ బాలు) ప్రథమ స్థానం సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశారు. ఎంతోమంది గాయకులు పోటీపడిన ఈ రాష్ట్ర స్థాయి పోటీలో ఉపేంద్రాచారి తన గాత్రంతో అందరినీ ఆకట్టుకుని విజేతగా నిలిచారు. మున్సిపల్ విధుల్లోనే కాకుండా సంగీత రంగంలోనూ తన ప్రతిభను చాటిన ఉపేంద్రాచారిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఉపేంద్రాచారి(జూనియర్ బాలు) మాట్లాడుతూ... తనకు సంగీతంలో సుశిక్షనిచ్చిన తన గురువుగారు శ్రీమాన్ రాచర్ల అనిల్ కుమార్ గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. గురువుగారి ఆశీర్వాదం, ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఉపేంద్రాచారి విజయం పట్ల మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

క్రీడా ప్రతిభకు ప్రోత్సాహకం - జాతీయ స్థాయికి ఎంపికైన పల్లవికి రూ. 50 వేల ఆర్థిక సాయం



సూర్యాపేట, నవంబర్ 3: వుదయం ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కుడకుడ గ్రామానికి చెందిన మనిమిద్దె రామకృష్ణ – రమాదేవి కూతురు పల్లవి క్రీడా రంగంలో సత్తా చాటింది. జడ్పీహెచ్ఎస్ కుడ కుడలో చదువుతున్న పల్లవి అండర్–17 ఎస్ జి ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు తెలంగాణ తరపున ఎంపికైంది. ఇది సూర్యాపేట జిల్లాకే గర్వకారణం. ఈ విషయం తెలుసుకున్న శ్రీకృష్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వీరభద్రస్వామి దేవాలయం వద్ద జరిగిన సమావేశంలో క్రీడాకారిణి పల్లవిని ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో రూ. 50 వేల నగదును అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ... చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న పల్లవిని ప్రోత్సహించేందుకు తమ వంతుగా సహాయం చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ క్రీడల్లో రాణించి సూర్యాపేటకు, తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ ఊర రామ్మూర్తి – గాయత్రి యాదవ్ లు వ్యక్తిగతంగా రూ. 10 వేలు, బీసీ సంఘం నాయకులు వట్టె జానయ్య యాదవ్ రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మర్యాద సైదులు, పోలెబోయిన నర్సయ్య యాదవ్, సుంకరబోయిన శ్రీనివాస్ యాదవ్, బయ్య నారాయణ, సుంకరబోయిన రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో నిలిచిన నీరు



మున్సిపల్ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టిన కౌన్సిలర్ ధారా నాగార్జున

మధిర, నవంబర్ 3:

భారీ వర్షాల కారణంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో రోడ్లపై నీరు నిలిచి ప్రజలకు ఏర్పడిన ఇబ్బందులను తొలగించేందుకు వార్డు కౌన్సిలర్ ధారా నాగార్జున తక్షణమే స్పందించారు. వార్డులోని రైల్వే స్టేషన్ మసీదు ప్రాంతం, గాంధీ సెంటర్ పరిసరాల్లో భారీ వర్షానికి రోడ్లపై నీరు నిలిచి పోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్య పై సమాచారం అందుకున్న కౌన్సిలర్ ధారా నాగార్జున వెంటనే మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి తెలియజేసి, వారిని సంఘటనా స్థలానికి రప్పించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి, నీరు సులభంగా కాలువల్లోకి వెళ్లేలా పూడికతీత పనులను ముమ్మరం చేయించారు. స్వయంగా దగ్గరుండి పనులను పర్యవేక్షించడంతో తక్కువ సమయంలోనే నీటి నిల్వ సమస్య పరిష్కారమైంది. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని కాలువలకు మళ్లించడంతో రాకపోకలు తిరిగి యథావిధిగా కొనసాగాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్ ధారా నాగార్జున చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- టపాసుల దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలి
- ప్రతి దుకాణంలో విద్యుత్ వైరింగ్ తనిఖీ చేసి ధృవీకరించాలి



ఖమ్మం, వుదయం బ్యూరోనవంబర్- 03

దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి దీపావళి పండుగ వేడుకలు, టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో టపాసుల విక్రయాలు, వినియోగం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సాధారణంగా దీపావళి తర్వాత వారం రోజుల వరకు కూడా టపాసులు కాల్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు అగ్నిమాపక, వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. టపాసుల దుకాణాల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టాలని అన్నారు. టపాసుల దుకాణాలను బహిరంగ ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలని, తాత్కాలిక నిర్మాణాల ఏర్పాటులో మండే స్వభావం కలిగిన పదార్థాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని, దుకాణాల మధ్య తగినంత ఖాళీ స్థలం ఉండేలా చూడాలని, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ప్రతి దుకాణంలోని విద్యుత్ వైరింగ్ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, ఇతర అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచడంతో పాటు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు టపాసుల విక్రయ కేంద్రాల వద్ద 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, ప్రథమ, ద్వితీయ స్థాయి కాలిన గాయాలకు అవసరమైన మందులు, వైద్య చికిత్సలను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం, పరిసరాల పరిశుభ్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి, దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యాపార లాభాల కంటే ప్రజల భద్రతే ముఖ్యమని, ఆదాయం కోసం భద్రతా ప్రమాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రెండు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, నగరంలో మరో అనువైన బహిరంగ ప్రదేశం ఉంటే అధికారులు గుర్తించి తెలియజేయాలని, అక్కడ కూడా దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని గ్రీన్ క్రాకర్స్ మాత్రమే వినియోగించాలని, కాలుష్యాన్ని పెంచే టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు. దీపావళి వేడుకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఏసీపీ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు 224 దరఖాస్తులు అందాయని, అందుబాటులో ఉన్న దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, డీపీఓ వినోద్ కుమార్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, టపాసుల దుకాణాల యజమానులు, విక్రయదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



యాదాద్రి భువనగిరి జిల్లా,
వుదయం ప్రతినిధి

నేషనల్ హెల్త్ మిషన్ (NHM) ఉద్యోగుల దీక్షకు బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, తెలంగాణ హోమియోపతి డాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివ ప్రసాద్ సంఘీభావం ఇతర రాష్ట్రాల మాదిరిగా వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న NHM ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యాద్రాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నేషనల్ హెల్త్ మిషన్ (NHM) కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన 22 వ రోజు నిరసన దీక్ష బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామ చంద్రారెడ్డి, మద్దతు ప్రకటించారు. భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా కొన సాగుతున్న ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి బీ ఆర్ ఎస్ పార్టీపరంగా పూర్తి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో NHM ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కరోనా వంటి క్లిష్ట సమయాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేశారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ కాంట్రాక్టు మరియు అవుట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హక్కులను సాధించేవరకు నిరాహార దీక్షకు సైతం వెనకాడ బోనాన్ని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దత్త యి పల్లి ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, ములకలపల్లి ఎంపీటీసీ రాజేష్ నాయక్, ఎంపీటీసీ భాస్కర్ నాయక్ హాజరై మాట్లాడారు.


తెలంగాణ హోమియోపతి డాక్టర్ అసోసియేషన్ మద్దతూ తెలంగాణ హోమియోపతి డాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కే. శివప్రసాద్ విచ్చేసి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా ఆరోగ్య తెలంగాణ గా తీర్చిదిద్దడంలో ఉద్యోగుల పాత్ర కీలక మన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే అసెంబ్లీ ముద్ది కైనా సిద్ధమని హెచ్చరించారు.

సంకెళ్లతో నిరసన:

సమ్మె 22వ రోజు సందర్భంగా ఉద్యోగులు వినూతన రీతిలో తమ నిరసన తెలిపారు. 22 రోజు సందర్భంగా సంకెళ్లతో తమ నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వానికి మంచి మనసు కల్పించాలని బోనగిరి లోనే రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ తల్లికి వినతి పత్రం అందజేశారు.

నవంబర్ 6న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పర్యటన

'భీమ్ హోమ్' శంకుస్థాపన



చిలుకూరు నవంబర్ 03:(వుదయం)

సూర్యాపేట జిల్లా కోదాద నియోజకవర్గ పరిధిలోని చిలుకూరు మండల కేంద్రంలోని జగ్జీవన్ రామ్ నగర్ కాలనీలో నవంబర్ 6వ తేదీ (శుక్రవారం) స్వేరోస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పర్యటించనున్నారు. ఇటీవల మరణించిన దివంగత కందుకూరి గురవయ్య,కుటుంబానికి అండగా నిలుస్తూ, వారి పిల్లల కోసం జిల్లా స్వేరోస్ కమిటీ ఆధ్వర్యంలో, నిర్మించతలపెట్టిన 'భీమ్ హోమ్' ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు పిడమర్తి దశరథ స్వేరో మాట్లాడుతూ, కోదాద నియోజకవర్గ పరిధిలోని స్వేరోస్ కుటుంబ సభ్యులు, ఆర్.ఎస్.పి అభిమానులు మరియు జిల్లా పి.పి.ఎల్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కుర్నపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



చర్ల, నవంబర్ 3: (వుదయం ప్రతినిధి)

చర్ల మండలం కుర్నపల్లి గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుర్నపల్లి బీఆర్ఎస్ యువ నాయకులు కారం కన్నారావు, బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జ్ రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. అనంతరం కుర్నపల్లి యువ నాయకులు కారం కన్నారావు, బాలకృష్ణ మాట్లాడుతూ.. తమ గిరిజన ప్రాంతంలో రెండు పంటలు పండేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలే ప్రధాన కారణమని అన్నారు. తమ ప్రాంత రైతులకు మూడు ఫేజ్ల విద్యుత్ సౌకర్యం కల్పించడం వల్ల ఎల్నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం ధైర్యంగా ఎదుర్కొనే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన కేసీఆర్కు గిరిజన ప్రాంత రైతులు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు గొర్ల రాజుబాబు, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, తుర్రం రాజు, నాగరాజు, క్యాప గణేష్, కాక నరసింహారావు, నక్క రాజు తదితరులు పాల్గొన్నారు. పలువురు పార్టీ యువ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

వర్షంలోనూ ప్రజల చెంతకు.. సమస్యల పరిష్కారమే లక్ష్యం!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 03

(వుదయం ప్రతినిధి)

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యంగా భావిస్తూ రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో పర్యటిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దతండా, ఉయ్యాలవాడ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత లైన్మెన్ బాలాజీతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాలకు అవసరమైన కేబుల్ వైర్ల మార్పు, ఇతర విద్యుత్ సమస్యలను పరిశీలించారు. స్థానికులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ధరావత్ బాల్య హనుమాన్ బస్తీ కార్నర్ వద్ద విద్యుత్పై అధిక భారం పడుతున్న విషయాన్ని గుర్తించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నూతన సింగిల్ఫేజ్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామంలోని ప్రతి బస్తీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు . వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్ చేస్తున్న క్షేత్రస్థాయి పర్యటనలు, చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మద్దాల ప్రభాకర్ రావు, సిఐటియు జిల్లా నాయకులు

మధిర, నవంబర్, 3, వుదయం, ప్రతినిధి:

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు హెచ్చరించారు. ఈ మేరకు బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మద్దాల ప్రభాకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని, వీరిలో అత్యధికులు బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలేనని తెలిపారు. గర్భిణులను ఆసుపత్రుల్లో ప్రసవించేలా చూడటంతో పాటు తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లు సీజనల్, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సబ్సెంటర్ విధులు, ఏఎన్సీ, పీఎన్సీ, టార్గెట్లు, ఎన్సీడీ ఆన్లైన్ సర్వేలు, స్పుటమ్ డబ్బాల మోయడం, పరీక్షల విధులు, డ్రై డే, ఫ్రైడే బెడ్రన్, పల్స్ పోలియో వంటి అనేక పనులను ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహిస్తున్నారని వివరించారు. ఇంతటి శ్రమ చేస్తున్న ఆశా వర్కర్లకు రాష్ట్రంలో ఫిక్స్డ్ వేతనం అమలు చేయకపోవడం సిగ్గుచేటని, కేవలం రూ.9,900 పారితోషికం చెల్లిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పెరిగిన పనిభారంతో వచ్చే పారితోషికం సరిపోక ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల నిరవధిక సమ్మె నిర్వహించారని, అక్టోబర్ 9న హైదరాబాద్ కోఠి కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా సందర్భంగా అప్పటి ప్రభుత్వం, ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు సైతం ఆశా వర్కర్ల పోరాటాల్లో పాల్గొని వారి డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. హైదరాబాద్ కోఠి కమిషనర్ కార్యాలయం వద్ద 2024 ఫిబ్రవరి 9, జూలై 30, డిసెంబర్ 10 తేదీల్లో జరిగిన ఆందోళనల సందర్భంగా రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు, టార్గెట్ల రద్దు, స్పుటమ్ డబ్బాలు మోయడం నిలిపివేత, ప్రమోషన్ల సౌకర్యం కల్పిస్తామని, రూ.18 వేల ఫిక్స్డ్ వేతనానికి సంబంధించిన ఫైల్ ప్రాసెస్లో ఉందని ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947లోని సెక్షన్ 22, సబ్సెక్షన్ 1 ప్రకారం సమ్మె నోటీసు ఇచ్చామని, డిసెంబర్ 15లోపు సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు నంద్రు సుధారాణి, ధనలక్ష్మి, వేల్పుల రాణి, జగన్నాథం, సుజాత, కోట రోజా, రాధ, విజయలక్ష్మి, రమణ, మలకారపు పుల్లమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగింపుపై భాస్కర్ల వీరంరాజు హర్షం



సత్తుపల్లి నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును నామినేషన్ చివరి తేదీ వరకు పొడిగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించడం పట్ల బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది భాస్కర్ల వీరంరాజు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా అధికారిక వెబ్సైట్లో సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన అనేక మంది పట్టభద్రులు ఆన్లైన్లో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోలేకపోయారని, ఈ సమస్యను పరిష్కరించి, గడువు పొడిగించాలని తాను ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించి గడువు పొడిగించడం వల్ల అర్హులైన పట్టభద్రులకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం లభించిందని, అలాగే, ఆన్లైన్లో దరఖాస్తు చేసినవారు మళ్లీ ప్రింట్ తీసి గెజిటెడ్ అధికారి సంతకంతో సమర్పించాలనే విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు..

యువతకు ఉపాధి కల్పించడమే నా లక్ష్యం: సర్పంచ్ లపంగి నర్సింహా

- రాంరెడ్డిపల్లిలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన
- హాజరైన 150 మంది నిరుద్యోగులు; 30 మంది దరఖాస్తు



మర్రిగూడ, నవంబర్ 3(వుదయం):

మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామీణ యువత ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సొంత ఊరిలోనే అవకాశాలు కల్పించడమే ధ్యేయమని సర్పంచ్ లపంగి నర్సింహా స్పష్టం చేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 150 మందికి పైగా యువత హాజరుకాగా, 30 మంది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు.యువతలో ప్రతిభ ఉంది.. కావాల్సిందల్లా అవకాశమే! ఒక్కరికి ఉద్యోగం వచ్చినా ఆ కుటుంబంలో వెలుగు నిండుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ కోరారు. సొంత గ్రామంలోనే జాబ్ మేళా ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీ వద్దిరాజు మాజీ మంత్రి ఎర్రబెల్లితో కలిసి చిరు వ్యాపారులకు ఎగ్ కార్డులు పంపిణీ చేశారు



ఖమ్మం వుదయం బ్యూరో నవంబర్ 3

కోడిగుడ్డు పుష్టికరమైన ఆహారమని,వీటి ద్వారా మన శరీరానికి అవసరమైన నాణ్యమైన ప్రోటీన్లు,విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఆయన సోదరుడు నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావుల ఆధ్వర్యాన వారి స్వగ్రామం పర్వతగిరి లోని నివాసంలో మంగళవారం మధ్యాహ్నం 30 మంది చిరు వ్యాపారులకు ఎగ్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ,పిల్లల ఎదుగుదలకు,కండరాల పుష్టికి,శరీరానికి అవసరమైన శక్తి కోడిగుడ్ల ద్వారా లభిస్తుందని వివరించారు.ప్రజల ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పిస్తూ లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా ఎగ్ కార్డుల పంపిణీ చేపట్టిన దయాకర్ రావు, ప్రదీప్ రావు,వారి కుటుంబ సభ్యులను ఎంపీ వద్దిరాజు అభినందించారు.ఈ సందర్భంగా వ్యాపారులకు స్టాల్, సిలిండర్,మూకుడు,గంటెలు అందజేశారు.

వుదయం

సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- నవంబర్ 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపు

సూర్యాపేట, నవంబర్ 3: వుదయం ప్రతినిధి

సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవన్ లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సూర్యాపేట జిల్లా కార్యవర్గ సమావేశం ఎల్లావుల రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ... సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొన్ని మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, కానీ జిల్లాలో ఉన్న అన్ని మండలాలతో పాటు మొత్తం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ నవంబర్ 10న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు, రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలు చేతికొచ్చే సమయానికే తుఫాను వల్ల పంట చేతికి రాకుండా రైతులకు నష్టం కలిగేలా ఉందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు జిల్లాలకు నిధులను తక్షణం అందించాలని, నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి వరికి 30 వేల రూపాయలు, వాణిజ్య పంటలకు 50 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం అందించాలని, రాబోయే రోజుల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజుల పని దినాలుగా పెంచి, రోజుకు కూలి 600 రూపాయలు చొప్పున పెంచి పనులు కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 90% నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కృత్రిమ బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని, బియ్యం ధరను అదుపులో ఉంచాలని, కరువు సమయంలో అధిక ధరలను నియంత్రించాలని తెలిపారు. పశు సామాగ్రిని సరఫరా చేయాలని, రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని రైతులను అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, ధూళిపాల ధనంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్ రావు, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, ఎస్కె లత్తు, బద్దం కృష్ణారెడ్డి, హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, ఎస్ కే సాయి బెల్లి తదితరులు పాల్గొన్నారు.



భూ రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి



తమ్మడపల్లిలో రీ సర్వే పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి

మర్రిగూడ,నవంబర్ 3 (వుదయం):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామంలో మంగళవారం జరుగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ సరిహద్దులు, రైతు భూముల కొలతలు, సర్వే పాయింట్ల నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే పనుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పారదర్శకంగా కొలతలు పూర్తి చేయాలన్నారు. సరిహద్దు వివాదాలు రాకుండా రైతుల సమక్షంలోనే రీ సర్వే పూర్తి చేసి రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ పాండురంగారెడ్డి, జీపీఓ గిరి, లైసెన్స్డ్ సర్వేయర్ రవిలతో పాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కక్షలకు కాలం చెల్లింది..

- ప్రజాస్వామ్యమే మా పాలనకు పునాది!
- ప్రతిపక్షమైనా, అధికార పక్షమైనా అందరికీ సమాన గౌరవం.. రాజకీయ వేధింపులకు, అక్రమ కేసులకు తావులేదు!
- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

కల్లూరు, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)



రాజకీయ కక్షలు కాదు.. ప్రజాసేవే లక్ష్యం! వేధింపులు కాదు.. ప్రజాస్వామ్యమే ప్రాధాన్యం! పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలందరికీ సమాన గౌరవం, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చే తీర్పే ప్రజాస్వామ్యంలో అంతిమమని, అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం కల్పించడమే తమ రాజకీయ సిద్ధాంతమని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో ప్రతిపక్ష కార్యకర్తలపై రాజకీయ వేధింపులకు, కక్షసాధింపు చర్యలకు, అక్రమ కేసులకు ఎలాంటి తావులేదని స్పష్టం చేశారు. గతంలో తాము సైతం రాజకీయంగా ఎన్నో వేధింపులు, మానసిక క్షోభను ఎదుర్కొన్నప్పటికీ, ఏనాడూ ప్రతీకార రాజకీయాలకు పాల్పడలేదని గుర్తుచేశారు. రాజకీయాల్లో హుందాతనాన్ని పాటిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ప్రజల నిత్యావసరాలు, వ్యక్తిగత సమస్యలను రాజకీయాలతో ముడిపెట్టే ధోరణికి స్వస్తి పలికామని పేర్కొన్నారు.

అర్హతే ప్రామాణికం.. ప్రతిపక్ష పేదలకూ ఇందిరమ్మ ఇళ్లు!

సంక్షేమ పథకాలు ఏ ఒక్క పార్టీ సొత్తు కాదని, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరుపేద కుటుంబాలకు సైతం పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో పార్టీ రంగు, రాజకీయ అనుబంధం కాకుండా అర్హతకే ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు.

గ్రామాభివృద్దే లక్ష్యం.. సర్పంచులకు సముచిత గౌరవం!

గ్రామాల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా గ్రామాభివృద్ధి కోసం పనిచేస్తే వారికి సముచిత గౌరవం, సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను కలుపుకొని సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

సామాన్యుడే కేంద్రబిందువు.. ఇంటింటికీ సంక్షేమం!

ప్రభుత్వ వనరులను సమర్థంగా వినియోగిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామని డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సామాన్య కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు.

– రైతులకు భరోసా: రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్‌తో వ్యవసాయానికి అండ.

– పేదలకు చేయూత: కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ.

– ఇంటి కల సాకారం: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.

– మహిళలకు ప్రాధాన్యం: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం.

– యువతకు ఉపాధి: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ ద్వారా ఉపాధి అవకాశాలు.

ఎన్నికలకే రాజకీయాలు.. ప్రజల కోసమే నిరంతర సేవ!

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ప్రజాసేవ మాత్రం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని వారు పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మట్టా దంపతులు పునరుద్ఘాటించారు.

వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు

- సరోజినీ వృద్ధాశ్రమానికి ఫ్రీజర్ బాక్స్ వితరణ
  – ప్రభుత్వ పాఠశాలలో శ్రీ సరస్వతీ దేవి విగ్రహ ఆవిష్కరణ
- వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు శిద్దా వెంకట సూర్యప్రకాష్ రావు సద్భావన పర్యటన సందర్భంగా సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

సారపాక 03/11/26 వుదయం ప్రతినిధి:



వాసవి క్లబ్ సారపాక గ్రేటర్ మరియు వాసవి క్లబ్ వనిత సారపాక సంయుక్త ఆధ్వర్యంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు Vn. Sowbagya Seva Sank-alpa శిద్దా వెంకట సూర్యప్రకాష్ రావు గారి సద్భావన పర్యటనను పురస్కరించుకుని భద్రాచలం ప్రాంతంలో పలు సేవా, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం, నిరుపేదలకు అండగా నిలవడం, వృద్ధులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం, విద్యార్థుల్లో విద్య, నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడం అనే ప్రధాన లక్ష్యాలతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వాసవి క్లబ్స్ ఆశయాలకు అనుగుణంగా సేవాభావాన్ని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ముందుగా భద్రాచలంలోని సరోజినీ వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడ నివసిస్తున్న వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా ఆశ్రమానికి ఫ్రీజర్ బాక్సును విరాళంగా అందజేశారు. కీర్తిశేషులు శ్రీ Vn. పచ్చిపులుసు వెంకట సూర్యనారాయణ గారి పవిత్ర జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని Vn. పద్మావతి గారు, అదేవిధంగా కీర్తిశేషులు Vn. ఆలపాటి వెంకన్న గారి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని Vn. ఆలపాటి లీల గారు సంయుక్తంగా ఈ ఫ్రీజర్ బాక్సును వృద్ధాశ్రమానికి సమర్పించారు. తమ జీవిత భాగస్వాముల జ్ఞాపకాలను సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో చిరస్థాయిగా నిలిపేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి ఆప్యాయత, ఆదరణ, భద్రతతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, వృద్ధులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని తెలిపారు. వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వారికి ఈ ఫ్రీజర్ బాక్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రాజీవ్ నగర్‌లోని టీ.వీ.వీ. ప్రభుత్వ ప్రాథమిక మోడల్ పాఠశాలలో శ్రీ సరస్వతీ దేవి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యకు అధిదేవత అయిన శ్రీ సరస్వతీ దేవి విగ్రహాన్ని పాఠశాల ప్రాంగణంలో ఆవిష్కరించడం ద్వారా విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తి, భక్తిభావం, ఏకాగ్రత, క్రమశిక్షణ, మంచి నడవడిక వంటి విలువలను పెంపొందించాలనే సదుద్దేశాన్ని చాటుకున్నారు. విద్యార్థుల జీవితాల్లో విద్య ఎంతో కీలకమని, విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. చదువుతో పాటు సంస్కారం, మానవతా విలువలు, పెద్దల పట్ల గౌరవం, గురువుల పట్ల భక్తి, సమాజం పట్ల బాధ్యత వంటి లక్షణాలను కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం, వారి అభ్యున్నతికి తోడ్పడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యారంగానికి సంబంధించిన సేవా కార్యక్రమాలకు వాసవి క్లబ్స్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా District V106A Governor Vn. Prog Golden KCGF చారుగుల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా క్యాబినెట్ సెక్రటరీ (సర్వీసెస్) Vn. 5 KCGF రేపాక ధనుంజయ రాజ మనోహర్, క్యాబినెట్ ట్రెజరర్ Vn. KCGF ఉడతా నగేష్ కుమార్, రీజియన్ చైర్మన్ Vn. SILVER KCGF బండారు కృష్ణయ్య, జోన్ చైర్‌పర్సన్ Vn. Family KCGF భూమా వెంకట చంద్రశేఖర్, వీకేఎస్పీ ఇన్‌చార్జ్ Vn. KCGF కేతేపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు. అదేవిధంగా క్యాబినెట్ జాయింట్ సెక్రటరీలు Vn. KCGF చారుగుండ్ల రామకృష్ణ, Vn. KCGF రేపాక రాజ్యలక్ష్మి , గుంటుపల్లి జగదీష్, సారపాక గ్రేటర్ క్లబ్ అధ్యక్షులు రేపాక సూర్యప్రకాష్ రావు, కార్యదర్శి బచ్చు సతీష్, కోశాధికారి కంచర్ల గౌతమ్, వాసవి క్లబ్ వనిత సారపాక అధ్యక్షురాలు కొంజర్ల నిరోషా, కార్యదర్శి పాల్వాయి పావని, కోశాధికారి గుడిమెట్ల అనూష పాల్గొన్నారు. వాసవి క్లబ్ సీనియర్ నాయకులు పచ్చిపులుసు సుబ్బారావు, లలిత కుమారి, గుడిమెట్ల సాగర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నాయకులు మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ప్రధాన ఆశయం సేవ, స్నేహం, సహకారం, సమాజ అభ్యున్నతి అని పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించడం ద్వారా మానవతా విలువలను కాపాడుకోవచ్చని తెలిపారు. వృద్ధాశ్రమానికి ఫ్రీజర్ బాక్స్ అందజేయడం ద్వారా వృద్ధులకు ఉపయోగపడే సేవ చేయగా, ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించడం ద్వారా విద్యార్థులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేశామని వివరించారు. సేవా కార్యక్రమాలు కేవలం ఒకరోజుకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగాలని, ప్రతి ఒక్కరూ తమకు చేతనైన విధంగా సమాజానికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వాసవి క్లబ్ సారపాక గ్రేటర్, వాసవి క్లబ్ వనిత సారపాక సభ్యులు సమష్టిగా ముందుకు వచ్చి రెండు విభిన్నమైన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఒకవైపు వృద్ధులకు అండగా నిలుస్తూ, మరోవైపు విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆధ్యాత్మిక వికాసానికి ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమాలు వాసవి క్లబ్స్ సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచాయి. సద్భావన పర్యటనలో భాగంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల సందేశాన్ని అందించడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సభ్యులకు స్ఫూర్తినిచ్చాయి.



నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సత్కారం

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ ఫ్యాబ్రిక్స్ సొసైటీ సమావేశంలో అభినందనలు

గట్టుప్పల్, నవంబర్ 3 (వుదయం):

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ ఫ్యాబ్రిక్స్ అండ్ మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ రాహుల్ పత్రికర్, వైస్ చైర్మన్ విజయ్ కె. ముల్లంద్‌లకు ఘనంగా సత్కారం జరిగింది. సొసైటీ బోర్డు సభ్యుల సమావేశంలో గట్టుప్పల్‌కు చెందిన బోర్డు డైరెక్టర్ కర్నాటి వజ్రమ్మ వెంకటేశం దంపతులు వారిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కర్నాటి వజ్రమ్మ వెంకటేశం మాట్లాడుతూ.. చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి, నేతన్నల సంక్షేమం, ఉత్పత్తుల మార్కెటింగ్ విస్తరణకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. సొసైటీ అభివృద్ధికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ సొసైటీ సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ చేనేత రంగాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ ఫ్యాబ్రిక్స్ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డు సభ్యులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి





అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర సంబంధిత విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పాఠశాలల విద్యా పురోగతి, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల కొరత, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా ఇతర పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల రిపోర్టింగ్‌లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాల యూనిఫారాల పంపిణీని దీపావళి నాటికి అన్ని పాఠశాలల్లో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 5వ తేదీన అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్–టీచర్ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. నవంబర్ నెలను వంద శాతం విద్యార్థుల హాజరు మాసంగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌నినో పరిస్థితులు, వాటి ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మెగా పేరెంట్–టీచర్ సమావేశాల్లో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా ఎల్‌నినోపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రశస్త (PRASHAST్) కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు 30 నిమిషాల అవగాహన వీడియోను తప్పనిసరిగా వీక్షించాలని ఆదేశించారు. సమావేశంలో సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు బూట్లు, యూనిఫారాల కొలతలు, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్), ఎస్ఏ–1 పరీక్షల మార్కుల నమోదు, విద్యార్థుల ఆధార్ నమోదు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ), డ్రాప్ బాక్స్, అపార్ ఐడీల జారీ, జీపీ, ఈపీ, ఎఫ్‌పీ స్థితి, పాఠశాల స్థాయిలో జీసీఈఏసీ కార్యకలాపాలు, స్వీయ రక్షణ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. అలాగే ఆయా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఏఎంఓ డి. శ్రీనివాస్, సీఎంఓ సుధాకర్ రెడ్డి, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌వోలు, ప్రిన్సిపాళ్లు, మిస్కోలు, సీసీవోలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత

- వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత
- ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలవడం గొప్ప మానవతా సేవ: యువ నాయకులు కుంజా సంతోష్

భద్రాచలం 03/11/26 వుదయం ప్రతినిధి:



అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు అండగా నిలుస్తూ, ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తూ వసుధ ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవత అనే మహిళకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. బాధిత మహిళ వైద్య చికిత్సకు కొంతైనా తోడ్పాటు అందించాలనే సదుద్దేశంతో రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేయడం అభినందనీయంగా నిలిచింది. వసుధ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మంతెన వెంకట రామరాజు సహకారంతో, ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీ వేగేశ్న శ్రీనివాస్ రాజు చేతుల మీదుగా బాధిత మహిళ అర్జునపూడి నవతకు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఒకవైపు బాధపడుతూ, మరోవైపు వైద్య ఖర్చులను భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో అందిన ఈ సహాయం బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు కొంత ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా యువ నాయకులు కుంజా సంతోష్ మాట్లాడుతూ భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో అనేక నిరుపేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నాయని, ముఖ్యంగా అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య ఖర్చులు భరించలేక ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలను గుర్తించి, వారికి అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్న వసుధ ఫౌండేషన్ సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, కష్టాల్లో ఉన్నవారికి మేమున్నామనే ధైర్యాన్ని కల్పించడం నిజమైన మానవతా సేవ అని అన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆందోళనకు గురవుతుందని, వైద్య ఖర్చులు పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేద కుటుంబాలకు చికిత్స చేయించుకోవడం పెద్ద భారంగా మారుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సేవా సంస్థలు, దాతలు ముందుకొచ్చి తమకు చేతనైనంత సహాయం అందించడం సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం, సామాజిక సేవ తదితర రంగాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని, ముఖ్యంగా భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని పేద ప్రజల అవసరాలను గుర్తించి వారికి తోడ్పాటు అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. వసుధ ఫౌండేషన్ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందిస్తూ, వారి కష్టాల్లో భాగస్వాములవుతున్న ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మంతెన వెంకట రామరాజు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీ వేగేశ్న శ్రీనివాస్ రాజు తదితరులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్జునపూడి సక్కుబాయి, హరిబాబు, రాజేష్, సాయి కౌశిక్, సవలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల పరిరక్షణ అందరి బాధ్యత



వ్యవసాయ అధికారి వేణు యాదవ్

గంగారం నవంబర్ 3 (వుదయం):

భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే ప్రతి రైతు సాగు భూమి పరిరక్షణను తమ బాధ్యతగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏఓ వేణు యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు మండల కేంద్రంలోని కొమట్లగుడ రైతు వేదిక కార్యాలయంలో రైతులకు "సాగు భూమిపై సంరక్షణ – తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశంపై ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఓ వేణు యాదవ్ మాట్లాడుతూ, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అతి వాడకం వల్ల నేలల సారవంతం తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రీయ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట ఎరువుల సాగు మరియు సరైన పంట మార్పిడి పద్ధతుల ద్వారా నేల సమగ్ర రూపాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. మట్టి పరీక్షలు ప్రతి మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని, ఫలితాల ఆధారంగానే ఎరువులను వాడాలి. సేంద్రీయ సాగు పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచాలి.

నీటి యాజమాన్యం అధిక నీటి వినియోగం వల్ల నేల చౌడుబారే ప్రమాదం ఉందని, బిందు (డ్రిప్), తుంపర (స్ప్రింక్లర్) సేద్యం వైపు రైతులు ఎక్కువగా మొగ్గు చూపాలని కోరారు. మట్టి ఆరోగ్యం బాగుంటేనే అధిక దిగుబడులు సాధించవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో ఏ పి యం రామ్ ప్రసాద్ రావు వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, స్థానిక సర్పంచ్ గుంట రామారావు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

వ్యక్తులను బెదిరించి డబ్బులు వసూల్ చేసిన ఘటనలో కేసు నమోదు

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లో ఆర్.టి.ఐ పేరిట అక్టోబర్ 30 న ఇద్దరు వ్యక్తులు బెదిరించి డబ్బులు వసూల్ చేసిన ఘటనపై మహబూబ్ నగర్ రూరల్ పోలీస్ లు కేసు నమోదు చేశారు. మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహిస్తున్న రాధ,మైబమ్మ లను చాయ్ తాగిన తర్వాత క్యాంటీన్ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయలేదని,క్యాంటీన్ కిచెన్ పరిశుభ్రం గా లేదని పై అధికారులకు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని బెదిరించి 30 వేలు డిమాండ్ చేయగా క్యాంటీన్ నిర్వాహకులు 15 వేలు వారికి అందచేశారు.ఈ విషయంపై రాధ,మైబమ్మలు రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా మందుల నిల్వ, కొనుగోలు





జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ

మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

మంగళవారం రంగారెడ్డి గూడా లోని రెండు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేసి క్లోజ్ చేయడం జరిగింది. అంతకుముందు డిఎంహెచ్ఓ గారు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను తనిఖీ చేసినా సందర్భంలో హై యాంటీబయాటిక్స్ , ఫ్లూయిడ్స్ మరియు అనుమతి లేకుండా మందుల నిలువలను కనుగొనడం జరిగింది. అదేవిధంగా వాడిన చిరంజీలు,సెలైన్ బాటిల్స్ ను రోజుల తరబడి నిల్వ ఉంచడం జరిగింది. వీటిని సైంటిఫిక్ లో డిస్పోజల్ చేయాల్సి ఉంది. లేనిచో ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. పై తెలిపిన ఉల్లంఘనల కారణంగా అట్టి రెండు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను మూసి వేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ శివకాంత్ నోడల అధికారి, హనుమంత హెల్త్ ఎడుకేటర్, సిద్దిక్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు, వృద్ధాశ్రమాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- వాతావరణ మార్పులు, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- కేడర్ పాఠశాల, బాలల సంరక్షణ కేంద్రాలు, వృద్ధాశ్రమాలు, ఐసీపీఎస్ కార్యక్రమాల పై సమీక్ష



పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

కేడర్ పాఠశాల, బాలల సంరక్షణ కేంద్రాలు, వృద్ధాశ్రమాల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కేడర్ పాఠశాల, బాలల సంరక్షణ కేంద్రాలు, వృద్ధాశ్రమాలు, సమీకృత బాలల సంరక్షణ పథకం (ఐసీపీఎస్) కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. వృద్ధాశ్రమాలు, బాలల సంరక్షణ కేంద్రాల్లో నివసిస్తున్న వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. వృద్ధుల వయస్సు, ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా పౌష్టికాహారం అందించాలని పేర్కొన్నారు. బాలల సంరక్షణ కేంద్రాల్లోని చిన్నారుల భద్రత, విద్య, పోషకాహారం, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి చిన్నారి ఆరోగ్య పరిస్థితి, విద్యాభ్యాసం, సంరక్షణకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలన్నారు. వృద్ధాశ్రమాల్లో నివసిస్తున్న వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఐసీపీఎస్ పరిధిలో బాలల రక్షణ, సంరక్షణ, పునరావాస కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సంరక్షణ అవసరమైన చిన్నారులను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, బాలల హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అధికారులు తరచుగా ఆయా కేంద్రాలను సందర్శించి అక్కడి సౌకర్యాలు, నిర్వహణ, చిన్నారులు, వృద్ధులకు అందుతున్న సేవలను పరిశీలించాలని, గుర్తించిన లోటుపాట్లను వెంటనే సరిదిద్ది మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ ,చిల్డ్రన్ హోమ్ సూపరిండెంట్ రమేష్ ,సీడీపీఓ లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి పెండింగ్ దరఖాస్తులు, రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్
- మండలానికి రెండు సర్వే బృందాల కేటాయింపు, వేగంగా రీ-సర్వే పూర్తికి ఆదేశం
- జీఓ 59, 76 పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- హైకోర్టు కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- రెవిన్యూ అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవిన్యూ శాఖ కార్యదర్శి



పెద్దపల్లి, నవంబర్, 03 (వుదయం ప్రతినిధి)

భూభారతి దరఖాస్తులు, రీ-సర్వే వివిధ జీఓలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం భూభారతి పెండింగ్ అంశాలు, హైకోర్టు కేసులు, రీ-సర్వే ప్రోగ్రామ్, జీఓ 59, జీఓ 76 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై హైదరాబాద్ నుంచి రెవిన్యూ శాఖ కార్యదర్శి డీ.ఎస్ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల రెవిన్యూ అదనపు కలెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు (రెవెన్యూ) కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసుల పరిష్కార ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రీ-సర్వే ప్రోగ్రామ్‌ను వేగవంతం చేసేందుకు గాను ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

జీఓ 59, జీఓ 76లకు సంబంధించిన

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జీఓ 59, జీఓ 76లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో జీఓ 59, జీఓ 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఒక నిర్దిష్ట కాలమితిలో సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి సమీక్షలో రెవిన్యూ శాఖ కార్యదర్శి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో భూభారతి పెండింగ్ పనులను, రీ-సర్వేను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతం చేస్తామని తెలిపారు. మండలాల వారీగా రీ-సర్వే కోసం ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దించి, జీఓ 59, జీఓ 76 పెండింగ్ ఫైళ్లను, పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ పరిపాలనాధికారి బి. ప్రకాష్, డి, సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ శిక్షణ ఇచ్చేందుకు శిక్షకుల ఎంపిక నిర్వహణ

జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద



పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఎంపిక చేసిన 48 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ (Self Defence / Karate) శిక్షణ అందించేందుకు గాను శిక్షకులను నియమించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయ రక్షణ శిక్షకులుగా నియమించబడేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 04న మధ్యాహ్నం 2:00 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి హాజరుకావాలని సీనియర్ అధికారుల సమక్షంలో జరిగే ఈ ఎంపిక ప్రక్రియలో అర్హులైన అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రాఫిక్ సీఐ తీరుపై న్యాయవాదుల ఆగ్రహం!

- అడ్వకేట్‌తో దురుసుగా ప్రవర్తించారంటూ ఆరోపణలు
- ఫోన్ లాక్కొని దూషించారని న్యాయవాది ఫిర్యాదు
- సీఐపై చర్యలు తీసుకోవాలని లాయర్ల నిరసన.. రోడ్డుపై ఆందోళన

పెద్దపల్లి, (గోదావరిఖని) నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు ఓ న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన న్యాయవాదులు మంగళవారం నిరసనకు దిగారు. పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. రామగుండం ప్రాంతానికి చెందిన అడ్వకేట్ షాన్వాజ్ ద్విచక్ర వాహనంపై కోర్టుకు వెళ్తుండగా ఫోన్‌లో మాట్లాడుతున్నారని ట్రాఫిక్ సీఐ తన ఫోన్ లాక్కొని, అసభ్యంగా దూషించారని ఆరోపించారు. అయితే తాను అలా మాట్లాడలేదని ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు వివరణ ఇచ్చారు. న్యాయవాది ఫోన్ లాక్కోవాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఎందుకు దూషించారని లాయర్లు సీఐని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యురాలు శైలజ, లాయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంజయ్‌కుమార్, ముచ్చకుర్తి కుమార్, పెద్దెల్లి ప్రకాష్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రవచనాలపై బీఆర్ఎస్ విమర్శలు సరికాదు

- గత పాలనలో ధ్వంసమైన రహదారులు , కూలిన బ్రిడ్జిలపై సమాధానం చెప్పాలి
- ముత్తారం కాంగ్రెస్ పార్టీ నాయకులు



ముత్తారం నవంబర్ 03(వుదయం ప్రతినిధి): యువతలో నైతిక విలువలు, ప్రజల్లో మానవతా దృక్పథం పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాలను రాజకీయంగా విమర్శించడం బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ముత్తారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రవచనాలు ఏర్పాటు చేస్తే విమర్శించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ముత్తారం మండలంలో ఇసుక రీచ్‌ల పేరుతో రహదారులను ధ్వంసం చేసి గుంతలమయం చేశారని ఆరోపించారు. భారీ లారీల రాకపోకలతో ప్రజలు ఇబ్బందులు పడగా, ఆ రహదారులకు మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత మంత్రి శ్రీధర్ బాబుదేనని పేర్కొన్నారు. ఓడేడు వద్ద బ్రిడ్జి నిర్మాణం కూలిపోవడంపై బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై మాట్లాడకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలను విమర్శించడం రాజకీయ అక్కసేనని అన్నారు. ధర్మం, మానవతా విలువలను పెంపొందించే కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు నీచ రాజకీయాలు మానుకోవాలని, ప్రజలు ఇప్పటికే తగిన బుద్ధి చెప్పారని వినీత్ యాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేశవపల్లి సర్పంచ్ పెగడ తిరుమల కుమార్, ఉప సర్పంచ్ సింగనవీణ సదయ్య, యూత్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, బుర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలు కరువు పట్ల ఆలోచన చేయాలి

- సూపర్ ఎల్నినో ద్వారా కరువు.. ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మవద్దు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోంది
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకురాయి గ్రామాల్లో మరియు పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో, చందపల్లిలో ఐకేపీ & సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన గౌరవ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ ఎల్నినో కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు గారు సూచించారు. కరువు పట్ల రైతన్నలు ఆలోచన చేయలని యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దలారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు మండలంలో ఐకేపీ మరియు సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు తన పంట అమ్మిన రెండు రోజుల్లోనే తన ఖాతాలో డబ్బులు జమ అవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉందని ధాన్యం కొనుగోళ్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు మరియు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం

రామడుగునవంబర్03(వుదయం ప్రతినిధి)

ఒక మనిషి మరణం ఒక కుటుంబానికి తీరని లోటు... అలాంటి సమయంలో ఆ కుటుంబానికి అండగా నిలవడం సమాజంగా మనందరి బాధ్యతరామడుగు మండలం రుద్రారం గ్రామానికి చెందిన నెల్లి పెద్ద శ్రీను మరణించడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఇప్పటికే నిరుపేద కుటుంబం కావడంతో, కనీసం అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసి పలువురు మానవతావాదులు స్పందించారు. ఈ దయనీయ పరిస్థితిని గుర్తించిన రుద్రారం మాజీ ఎంపీటీసీ గుర్రం దేవిక రాజశేఖర్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చి, దాతల సహకారంతో రూ.50,000 ఆర్థిక సహాయాన్ని సేకరించారు. రుద్రారం గ్రామ సర్పంచ్ భీమ యశోద ఈశ్వర్, ఉపసర్పంచ్ పర్వరాములు, మాజీ ఉప సర్పంచ్ రంగు గోపాల్ వార్డు సభ్యులు సైతం తమవంతు సహకారాన్ని అందించి ఈ మంచి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. గ్రామంలోని పలువురు దాతలు అందించిన విరాళాలతో సేకరించిన రూ.50,000 మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ ఆపద సమయంలో స్పందించి కుటుంబానికి అండగా నిలిచిన గుర్రం దేవిక రాజశేఖర్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు విరాళాలు అందించిన ప్రతి దాతకు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావేత్త గీకురు రవీందర్ 56వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

చిగురుమామిడి, నవంబర్ 3 :

తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావేత్త, చిగురుమామిడి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ గారి 56వ వర్ధంతిని ఆయన అనుచరులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, విద్యారంగంలో గీకురు రవీందర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవ, సమాజ అభివృద్ధి కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చెరుకు చిన్న సమయ్య (వార్డు సభ్యుడు), పోతర్ల శివాంజనేయులు (వార్డు సభ్యుడు), శిరవేణి సంపత్, బెజ్జంకి అంజయ్య, డాక్టర్ బొల్లి రమేష్, పెసరి శ్రీనివాస్, చొప్పదండి సాయి కుమార్, భాషవేణి రమేష్, బెజ్జంకి జాక్స్, గుజ్జుల రాజు, వేల్పుల పరశురాములు, జయంత్, యెడల శివ, పొన్నం శేఖర్, బెజ్జంకి శేఖర్, మల్లం సతీష్, మల్లం అక్షిత్, పొన్నం రాజు, కొమ్ముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టం సాధన కమిటీ పట్టణ అధ్యక్షుడిగా నవీన్

వేములవాడ, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి) :

సమాచార హక్కు చట్టం–2005 అమలుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమంలో భాగంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వేములవాడ పట్టణ అధ్యక్షుడిగా చేకూర్తి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నవీన్‌కు కమిటీ జిల్లా అధ్యక్షుడు పులి మధుకర్ అభినందనలు తెలిపారు. నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి నర్సింగోజు శ్రీధర్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లవేని సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన అధ్యక్షుడు నవీన్ కమిటీని మరింత బలోపేతం చేస్తూ, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషించాలని మధుకర్ ఆకాంక్షించారు. కమిటీల ఏర్పాటులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి నర్సింగోజు శ్రీధర్ మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఆపదలో ఆపన్నహస్తం.. రక్తదానంతో ప్రాణదాతగా రాజేష్!

రజిత ఫౌండేషన్ చొరవతో సకాలంలో రక్తం.. మానవత్వం చాటిన కానిస్టేబుల్



ముత్తారం నవంబర్ (వుదయం ప్రతినిధి:

ఆపదలో ఉన్న ఓ రోగికి రక్తం అందక ప్రాణాపాయ పరిస్థితి నెలకొనగా..రజిత ఫౌండేషన్ చొరవతో కానిస్టేబుల్ రాజేష్ రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసరంగా రక్తం అవసరమని సమాచారం అందుకున్న ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి రాజేష్‌కు విషయం తెలియజేశారు. దీంతో ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. సమయానికి రక్తం అందడంతో రోగికి సహాయం అందింది. రాజేష్ సేవకు, రజిత ఫౌండేషన్ చొరవకు రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సేవే లక్ష్యంగా..

రజిత ఫౌండేషన్ గత కొంతకాలంగా నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కులమతాలకు అతీతంగా అవసరంలో ఉన్నవారికి సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుతోంది. అత్యవసర సమయంలో రక్తదానం కోసం ముందుకు రావడం ఫౌండేషన్ సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రచార ఆర్భాటాలకు దూరంగా సేవనే లక్ష్యంగా పనిచేస్తున్న ఫౌండేషన్ సభ్యుల సేవలను పలువురు అభినందిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడుతున్నారు.

సర్పంచుల ప్రశ్నలతో వేడెక్కిన సమావేశం!

విద్యుత్,ఉపాధి హామీ, ధాన్యం కొనుగోళ్లపై నిలదీతలు.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ముత్తారం నవంబర్ 03(వుదయం ప్రతినిధి):

మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు ప్రస్తావిస్తూ అధికారులను నిలదీశారు. విద్యుత్ సమస్యలు, ఉపాధి హామీ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, భూ సమస్యలు, ఆర్అండ్‌బీ అధికారుల పనితీరుపై చర్చించారు. గ్రామ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మండలంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే వివిజి రామ్ జీ ఉపాధి హామీ పనులు ప్రజలకు కల్పించడం లేదని ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఆర్అండ్‌బీ అధికారిపై మండిపాటు

మండలంలో ఆర్అండ్‌బీ అధికారి పనిచేస్తున్నాడా? అంటూ సర్పంచ్ అత్తే చంద్రమౌళి మండిపడ్డారు. గ్రామాల్లో రహదారి సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూమి ముఖపైన ఒక వ్యక్తి పేరు ఉండగా, పట్టాదారుగా మరో వ్యక్తి పేరు నమోదైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. భూ రికార్డుల్లో తప్పిదాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాలేవీ?

మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని సర్పంచ్ అత్తే చంద్రమౌళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 40 శాతం ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఎజెండా పంపించలేదని ఆగ్రహం

ముత్తారం సర్పంచ్ సుధాటి రవీందర్‌రావుకు సమావేశ ఎజెండా పంపించకపోవడంపై లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు సమావేశ సమాచారం ముందుగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సర్వసభ్య సమావేశంలో సర్పంచుల స్థానంలో ప్రైవేట్ సర్వేయర్ ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

చూసీచూడనట్లు అధికారులు!

సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమావేశాలు నిర్వహిస్తున్నా, అధికారులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నా పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు రాపెల్లి రాజయ్య, మెంగని సమత, ఊట్ల చరణ్, గద్దం రాజేశం, చిలువేరీ జ్యోతి, చొప్పరి సంపత్, తోపాటు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకలికి అన్నం.. 2,034 రోజులుగా అన్నదాన యజ్ఞం

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవకు దాతల చేయూత



వేములవాడ, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి) :

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే లక్ష్యంగా.. సేవే మార్గంగా.. మానవత్వమే ధ్యేయంగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా యజ్ఞం నిరాటంకంగా కొనసాగుతోంది. దాతల సహకారంతో పేదలు, అన్నార్తులు, భక్తులకు గత 2,034 రోజులుగా ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తూ ఆకలి తీర్చడంలో తనవంతు పాత్ర పోషిస్తోంది.

పుట్టినరోజు వేడుకలు.. అన్నదాన సేవలు

పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, పితృదేవతల స్మరణ వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆడంబరాలకు దూరంగా అన్నదానం చేయడం ద్వారా ఆనందాన్ని పంచుకోవడం అభినందనీయమని ట్రస్ట్ నిర్వాహకులు పేర్కొన్నారు. మనకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని ఆకలితో ఉన్నవారికి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. న్యూజిలాండ్‌లో పుట్టినరోజు జరుపుకుంటున్న దొంతుల కాత్యాయని సందర్భంగా ఆమె భర్త లావణ్ కుమార్, కుటుంబ సభ్యులు.. హైదరాబాద్‌లో పుట్టినరోజు జరుపుకుంటున్న లక్కాకుల నాగశిరీష సందర్భంగా ఆమె భర్త రవి కుమార్, కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు, అలాగే జువ్వాడి వెంకటేశ్వరరావు–స్నేహలత, ప్రతాప స్వప్న–సంపత్, నగుబోతు రవీందర్–జ్యోతి, గణాచారి సాంబశివ–శైలజ, దేవరాజు ఉమ–బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, వారి కుమారులు, కోడళ్లు ప్రజ్ఞ, శరత్చంద్ర, శిరీష, సాయిచంద్ర, శర్వాణి, రవిచంద్ర దంపతులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ తదితరులు శాశ్వత అన్నదాతలుగా సహకరిస్తున్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి దాతకు, ట్రస్ట్ సభ్యులకు నిర్వాహకులు మధు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. మరింతమంది సేవాభావం కలిగిన దాతలు ముందుకొచ్చి ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. మనమంతా చేయి చేయి కలిపి ఆకలిలేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల స్థానంలో ప్రైవేట్ సర్వేయర్!

మండల పరిషత్ సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు.. ప్రజాప్రతినిధుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తి



ముత్తారం నవంబర్ 03(వుదయం ప్రతినిధి):

ప్రజాప్రతినిధుల స్థానంలో ప్రైవేట్ సర్వేయర్ కూర్చున్నా పట్టించుకోని అధికారులు.. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల బాధ్యతారాహిత్యం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం నిర్వహించిన సమావేశంలో సర్పంచుల స్థానంలో ప్రైవేట్ సర్వేయర్ కూర్చోవడం విమర్శలకు దారితీసింది. గ్రామాల సమస్యలను పరిష్కరించాల్సిన సమావేశంలో ప్రజాప్రతినిధుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తి ఉండటంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశ నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు గౌరవం కల్పిస్తూ, సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని కోరారు.

నిరుద్యోగ భృతి ఊసే లేదు

- తెలంగాణ రక్షణ సేనలో కొనసాగుతున్న యువకుల చేరికలు
- గుంజపడుగు హరిప్రసాద్ ,తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు



కరీంనగర్ నవంబర్ 03 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ రక్షణ సేనలో యువత చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయని. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంపై నమ్మకంతో ఆమె చేస్తున్న ప్రజా పోరాటాల పట్ల ఆకర్షితులై పలువురు యువకులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. యువ నాయకుడు రాగడి సందీప్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనగొండ పవన్ కృష్ణ, దావరి కార్తీక్, జెరిపోతుల నవీన్, మహమ్మద్ అఫ్రోజ్‌లు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలో రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, సమాజంలో మార్పు తీసుకురావడంలో యువకులది కీలకమైన పాత్ర అని వారు అన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరుద్యోగ యువత సమస్యల మీద రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజల ఇబ్బందుల మీద తెలంగాణ రక్షణ సేన నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు కవితమ్మ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన యువకులకు సముచిత గుర్తింపు ఉంటాయని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరి తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ అంకం శివరాణి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మడిపల్లి వినీత్, జిల్లా నాయకులు గర్శకుర్తి విద్యాసాగర్, గుంజపడుగు పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఖరీఫ్ సీజన్‌లో 4.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా
- నవంబర్ రెండో వారం నుంచి పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడులు వస్తాయి
- ప్రతిపాదిత 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా జిల్లాలో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్ 2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. రైతులు బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించుకునే పరిస్థితి రాకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 4 లక్షల 69 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 26 వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం ఉత్పత్తి అయినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందిస్తుందని పేర్కొన్నారు.బహిరంగ మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గిన పక్షంలో రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

రూ.500 బోనస్ అందేలా

సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందేలా కొనుగోళ్లు చేపట్టాలని స్పష్టం చేశారు. నవంబర్ రెండో వారం నుంచి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలో ప్రతిపాదించిన 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కొనుగోలు కేంద్రాలకు సుమారు 2 లక్షల 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1,62,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డి.సి.ఓ. శ్రీమాల,జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ.కాళిందిని, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



యాసంగి సాగులో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి



- నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి):-

రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాల మట్టం పడిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం మందిరంలో వ్యవసాయ, నీటి పారుదల, ఉద్యానవన తదితర సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి వనరులు పరిమితంగా ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడి, ఆదాయం పొందగలిగే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పెసర, మినుములు, కందులు వంటి పప్పుధాన్యాలు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు సరైన మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. ప్రతి అధికారి రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్, కూరగాయల వంటి ఉద్యానవన పంటల సాగుతో తక్కువ నీటిని వినియోగిస్తూ మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీలను అర్హత, నిబంధనల ప్రకారం అందేలా చూడాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. సాగుభూమి సంరక్షణకు సంబంధించి అమలు చేస్తున్న 'ఖేత్ బచావో అభియాన్'తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వివరాలను ప్రతి రైతుకు చేరవేయాలన్నారు. పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా పశుగ్రాస పంటల సాగును కూడా ప్రోత్సహించాలని సూచించారు. రైతు బీమా పరిహారం పొందడంలో రైతు కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తహసీల్దార్లు మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల ఎంపిక చేసుకోవాలని, నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారిని జ్యోతి, గిరిజన శాఖ అధికారి సౌజన్య, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఏడీఏలు, అధికారులు, అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనరల్ బాడీకి బీఆర్ఎస్ సర్పంచ్‌కు నో ఎంట్రీ!

సమావేశానికి ఆహ్వానించలేదంటూ ముత్తారం సర్పంచ్ సుదాటి రవీందర్ రావు ఆవేదన

ముత్తారం నవంబర్ 03(వుదయం ప్రతినిధి):



మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి తనను ఆహ్వానించకపోవడంపై ముత్తారం గ్రామ సర్పంచ్ సుదాటి రవీందర్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌నైనందుకే అధికారులు కావాలనే తనను విస్మరించారని ఆరోపించారు.ప్రజాప్రతినిధుల పట్ల రాజకీయ వివక్ష చూపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం మండల పరిధిలోని ప్రజాప్రతినిధులందరికీ జనరల్ బాడీ సమావేశానికి సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను సమావేశంలో ప్రస్తావించే అవకాశం కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే, తనకు సమావేశం గురించి సమాచారం ఇవ్వకపోవడం వెనుక అధికారుల పక్షపాత వైఖరి ఉందని ఆరోపించారు.

ప్రజా సమస్యలు ప్రస్తావించే అవకాశం ఏది?

ప్రజల ఓట్లతో ఎన్నికైన సర్పంచ్‌లను పార్టీల ఆధారంగా వివక్షకు గురిచేయడం సరికాదన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సమావేశాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం వారి హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. అధికారులు ఇలాంటి వైఖరిని విడనాడి ప్రజాప్రతినిధులందరికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ సుదాటి రవీందర్ రావు తెలిపారు. అధికారులు స్పందించి పక్షపాత వైఖరిని సరిదిద్దాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెద్దపల్లిలో 10 కొత్త వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఏసంగి పంట మొక్కజొన్న, శనగలు వేయండి
ప్రభుత్వ విప్ విజయ రమణారావు కీలక ప్రకటన

పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)



పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు శుభవార్త,పెద్దపల్లి మండలం లోని పెద్దబొంకూర్,కొత్తపల్లి,ములసాల,భోజన్నపేట, చీకురాయి, హన్మంతునిపేట, మారేడుగొండ,గుర్రంపల్లి,పెద్దపల్లి,చందపల్లి, గ్రామాల్లో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (PACS) అధ్యక్షులు ముత్యాల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో విప్ విజయ రమణారావు మాట్లాడిన మాటలు రైతుల్లో భరోసా నింపాయి.

10 రోజుల నీళ్లు పంటల కాపాడాయి ప్రభుత్వ విప్

పెద్దపల్లి జిల్లాతో పాటు పెద్దపల్లి నియోజకవర్గంలో ఒక్క రైతు కూడా నష్టపోకూడదు అనే సదుద్దేశంతో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని ఒప్పించి కాలువ నీళ్లను పది రోజులు వచ్చేలా చర్యలు చేపట్టాం అన్నారు. పాలు తాగే దశలో ఉన్న వరి పొలాలు, కాలువలు వాగుల ద్వారా ఆయకట్టు చివరి మడి వరకు కాల్వల ద్వారా నీళ్లు గనక అప్పుడు ఇవ్వకుంటే జిల్లాలో రెండు లక్షల పదిహేను వేల ఎకరాలలో సగం పంటలు ఎండిపోయేవి అన్నారు. అవి నీళ్లు పంటలను కాపాడై అన్నారు. సరైన టైంలో నీళ్లు అందకుంటే, రైతులకు కోట్లలో నష్టం జరిగేది అని గుర్తు చేశారు. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తుంది అన్నారు. అది చూస్తే నాకు సంతోషంగా ఉంది అని ఆనందం వ్యక్తం చేశారు.

ఏసంగికి ఎల్ నినో ఎఫెక్ట్ – ఆరుతడి పంటలే బెటర్

రానున్న ఏసంగి సీజన్ లో రైతులు అప్రమత్తంగా ఉండాలి అన్నారు . ఈసారి ఎల్ నినో ప్రభావం ఉన్నందున వర్షాభావ పరిస్థితులు వచ్చే అవకాశం తక్కువ అన్నారు. చెరువులు కుంటల్లో నీళ్లు ఉండవన్నారు. భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది అన్నారు. ఈ విషయాన్ని స్వయంగా వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది అని తెలిపారు. రానున్న రోజుల్లో భూగర్భ జలాలు తీవ్రస్థాయిలో పడిపోతాయి కాబట్టి, రైతులు తప్పనిసరిగా ఆరుతడి పంటలు వేయాలి అని సూచించారు. వరికి బదులు మొక్కజొన్న, శనగలు లాంటి పంటలు వేస్తే నష్టం ఉండదు అన్నారు. వాటికి మద్దతు ధర వచ్చే విధంగా నేను ప్రభుత్వంతో మాట్లాడి చూసుకుంటా అని రైతులకు భరోసించారు. మీరు ధైర్యంగా ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని భరోసా ఇచ్చారు.

41 కిలోల నిబంధన – ఒక్క గింజ ఎక్కువ వద్దు

వరి ధాన్యం తూకం విషయంలో రైతులకు క్లారిటీ భరోసా ఇచ్చారు. ఒక బస్తాకు 41 కిలోలు మాత్రమే జోకాలి అని స్పష్టం చేశారు. అంతకంటే ఒక గింజ ఎక్కువ తూకం పెట్టద్దు అని సెంటర్ నిర్వాహకులను హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా ధాన్యం కొనుగోలు సెంటర్లలో ఎక్కువ తూకం జోకితే నాకు ఫోన్ చేయండి అని రైతులకు సూచించారు.

కేంద్రాలలో అవకతవకలు జరిగితే చర్యలు – నిర్వాహకులకు స్ట్రాంగ్ వార్నింగ్.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు గట్టి హెచ్చరిక చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు నష్టం కలిగించే విధంగా, అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు అంటూ హెచ్చరించారు. గతంలో కొన్ని సెంటర్ల నిర్వాహకులు అక్కడక్కడ తప్పిదాలు చేశారు అన్నారు. అలాంటి పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకూడదు చూసుకోవాలన్నారు. ఎవరైనా తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవు అని వార్నింగ్ ఇచ్చారు.

వ్యాపారులతో జాగ్రత్త – ఫోన్ పే, గూగుల్ పే అంటే నమ్మొద్దు

తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ తో కలిపి మద్దతు ధర2962 ఇస్తుంది అన్నారు. ఒకవేళ ప్రభుత్వ ధర కంటే ఎక్కువ డబ్బులు వస్తే రైతుల ఇష్టం మేరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవచ్చు అన్నారు. కానీ నేను రైతు బిడ్డగా శ్రేయోభిలాషిగా చెప్తున్నా,నగదు డబ్బులు వస్తేనే ఇవ్వండి. ఫోన్ పే, గూగుల్ పే లో పంపిస్తా అంటే నమ్మొద్దు, డబ్బుల కోసం వ్యాపారులు రైతులను తిప్పించుకునే ప్రమాదం ఉంది అని రైతులకు ముందస్తుగా సీరియస్ గా వార్నింగ్ ఇచ్చారు. ఆశపడి మోసపోవద్దు ఈ తప్పు చేయొద్దన్నారు. పైసలు ఇటు – వడ్లు అటు అనే విధంగా ఉండాలి అని రైతులకు కీలక సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల నరేష్, స్థానిక సర్పంచులు రైతులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిఆర్ఎస్ సర్కార్ అభివృద్ధి చిహ్నాల తొలగింపుపై రగడ

- ఫైలాన్ తరలింపును అడ్డుకున్న గులాబీ నేతలు
- కార్పొరేషన్, పోలీస్ లతో మాజీ ఎమ్మెల్యే వాగ్వివాదం

పెద్దపల్లి, (గోదావరిఖని) నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో మంగళవారం ఉదయం అభివృద్ధి చిహ్నం (ఫైలాన్ తొలగింపు) రగడగా మారింది. టిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఫైలాన్ తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. కెసిఆర్ ప్రభుత్వ హాయంలో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రామగుండం కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా నగరంలో ఏర్పాటు చేసిన ఫైలాన్ తొలగింపుపై గులాబీ శ్రేణులు గరం గరం అయ్యారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులకు విలువ లేదా..! రాజకీయ కుట్రలతో ఫైలాన్ తొలగింపు సరికాదంటూ మాజీ ఎమ్మెల్యే చందర్ తీవ్రంగా మండిపడ్డారు. కార్పొరేషన్ అధికారులను, పోలీస్ అధికారులను నిలదీశారు. ఫైలాన్ తొలగింపుకు ఎవరు అనుమతి ఇచ్చారో చెప్పాలంటూ చందర్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి, పోలీస్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ప్రమాదాలకు ఫైలన్ కారణంగా మారిందన్న నేపథ్యంలో రహదారి పైనున్న ఫైలాన్ ను మున్సిపల్ అధికారులు తొలగింపులు చేపట్టినట్టు తెలుస్తోంది. అభివృద్ధి చిహాలను కూల్చివేసేందుకు అనుమతులు ఎవరిచ్చారు అని చందర్ ప్రశ్నించారు. ఫైలాన్ తొలగింపు... కూల్చివేతల కోసం ఘటన స్థలికి వచ్చిన జెసిబి ముందు టిఆర్ఎస్ నేతలు బైటాయించారు. రామగుండం ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలంటూ టిఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. కార్పొరేషన్ లో కౌన్సిల్ తీర్మానం లేకుండా అభివృద్ధి చిహాలను ఎలా తొలగిస్తారు అంటూ టిఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కు సమాచారం లేకుండా ఫైలాన్ తొలగింపు పూర్తిగా దౌర్జన్యమైనని ఆక్రోశించారు.

సహకార బ్యాంకు మహాసభకు హాజరైన సొసైటీ చైర్మన్లు

నాగిరెడ్డిపేట, నవంబర్ 3(వుదయం):



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 104వ వార్షిక మహజన సభకు నాగిరెడ్డిపేట మండలానికి చెందిన సొసైటీ చైర్మన్లు హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాండూర్ కిచ్చన్నపేట సొసైటీ చైర్మన్ బొగుడమిది శ్రీధర్ గౌడ్, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ కళాలి సురేందర్ గౌడ్‌తో పాటు లింగంపేట్, ఎల్లారెడ్డి మండలాల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు. సొసైటీల అభివృద్ధి, రైతులకు రుణాలు, సంక్షేమ పథకాల అమలుపై బ్యాంకు అధికారులతో చర్చించినట్లు చైర్మన్లు తెలిపారు.



సోలార్ యూనిట్ మహిళలకు వరం

సోలార్ డైరెక్టర్ కృష్ణ

పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లు మహిళలకు వరం లాంటి దాన్ని సర్ఫ్ నుండి వచ్చిన సోలార్ డైరెక్టర్ కృష్ణ అన్నారు. మంగళవారం రోజు పెద్దపల్లి కలెక్టరేట్లోని హాలులో స్వ శక్తి సంఘాల మహిళలకి జరిగిన సోలార్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో రెండు మెగావాట్ల సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయడం కొరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి స్వశక్తి సంఘం మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వ సంకల్పం లో భాగంగా ప్రతి జిల్లాలో ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అన్నారు. అందులో భాగంగానే ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటుచేసిన రెండు మెగావాట్ల సోలార్ యూనిట్లు ముఖ్యమంత్రి గారి స్వయంగా ప్రారంభించడం జరిగింది అన్నారు. పెద్దపల్లి డిఆర్డిఓ. Drda కాళిందిని మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో మంథని మండలంలో ఒక మెగా వాట్ యూనిట్ ఇప్పటికే పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం కేంద్రంలో1MW యూనిట్ కొరకు భూమి పూజ ప్రభుత్వంవిప్ మరియు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు గారి చేతుల మీదుగా చేయడం జరిగిందన్నారు. మహిళలు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని పుచ్చుకొని ఆదాయ అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని కోరారు. Redco ఉమ్మడి కరీంనగర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ సహజ వనరులు క్రమంగా అంతరించిపోతున్నాయ ని, సోలార్ విద్యుత్ ద్వారా ఉపయోగించుకొని ఆదాయం పొందాలన్నారు. ప్రతి స్వశక్తి మహిళ కూడా తమ ఇంటి పైన సోలార్ పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మంచిర్యాల్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల మండల సమాఖ్య ఆఫీస్ బ్యారర్లు, పెద్దపల్లి additional Drdo, B. రవీందర్, మంచిర్యాల అడిషనల్ డి అంజయ్య, Dpm, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లేశం మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సంతాపం

పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంపత్ గారి తండ్రి మల్లేశం గారు అనారోగ్యంతో కన్నుమూశారనే విషయం తెలుసుకున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి గారు వారి స్వగృహానికి చేరుకుని మల్లేశం గారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం గారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి కలిగిన ఈ తీరని లోటు పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు మల్లేశం గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హామీలు కాదు.. ప్రజలకు హక్కులు కావాలి: దేవసోత్ శ్రీనివాస్ నాయక్

నాగిరెడ్డిపేట,వుదయం



తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, AIDYO రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ దేవసోత్ శ్రీనివాస్ నాయక్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు కేటాయించిన నిధులు, విడుదల చేసిన నిధులు, ఖర్చులు, లబ్ధిదారుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.రైతు భరోసా, రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేసి ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలన్నారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు అందించాలని, గ్రామీణ, పట్టణ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఉస్మానియా, JNTUH అనుబంధ ప్రైవేట్ కళాశాలల ఉద్యోగుల అసలు విద్యా ధ్రువపత్రాలను తిరిగి అప్పగించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ శాఖల పనితీరుపై నెలవారీ నివేదికలు విడుదల చేయాలని శ్రీనివాస్ నాయక్ రాథోడ్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం,సామాజిక న్యాయం,పారదర్శక పాలనే నిజమైన ప్రజాపాలన అని స్పష్టం చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో బెస్ట్ ఈవెంట్

దండేపల్లి: నవంబర్ 03 (వుదయం విలేఖరి)



గూడెం సెక్టార్ లోని గుడిరేవు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఘనంగా కమ్యూనిటీ బేస్ట్ ఈవెంట్ కార్యక్రమం నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ ఈవెంట్ కార్యక్రమంలో భాగంగా 3 సంవత్సరాలు పూర్తి అయిన బాబు కి అక్షరాభ్యాసం అత్యంత ఘనంగా నిర్వహించి ప్రి స్కూల్ లో జాయిన్ చేసుకోవడం జరిగిందన్నారు ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య సంరక్షణ,పౌష్టికాహారాన్ని అందించే విధానం, మరియు శారీరక ఎదుగుదల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవల గురించి, అలాగే చిన్న పిల్లల పెంపకంలో తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళా,అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి,గర్భిణులు, బాలింతలు,తల్లులు మరియు పిల్లలు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై అవగాహనలో.. మాస్టర్ మైండ్స్ విద్యార్థులు

అభినందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అనుష సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 3 :



వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మాస్టర్ మైండ్స్ స్కూల్–2 విద్యార్థులు చొరవ చూపారు. పట్టణంలో విద్యార్థులు నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్ పరిశీలించి అభినందించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గడం, కరువు పరిస్థితులు, వ్యవసాయంపై పడే ప్రభావాలను విద్యార్థులు వివరించారు. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. నీటి పొదుపు, విద్యుత్ ఆదా, మొక్కల పెంపకం, ప్రకృతి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గంట జీవన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హస్తినలో జిల్లా కాంగ్రెస్ నేతల మర్యాదపూర్వక భేటీ

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 3 :



ఢిల్లీలోని జనపథ్‌లో ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో బీహార్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కృష్ణ అల్లవరును ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో సమావేశమై మాట్లాడారు. జాతీయ స్థాయి పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీతో జిల్లా కాంగ్రెస్ నాయకుల ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.



విద్యార్థులకు ఎన్నికలపై క్విజ్ పోటీ

జన్నారం,నవంబర్ 3 (వుదయం విలేఖరి)

జన్నారం మండల కేంద్రంలోని స్థానిక బాయ్స్ హై స్కూల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.ఎన్నికల సంఘం,సీఈవో ఆదేశాల మేరకు మంగళవారం రోజున పాఠశాలలో ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు తహసిల్దార్ బక్కయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు అనే అంశంపై క్విజ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

జన్నారం,నవంబర్ 3 (వుదయం విలేఖరి)



జన్నారం మండల కేంద్రంలోని జయరాణి ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మంగళవారం రోజున స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించినట్లు మండల అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా సిబ్బంది అగ్నిప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదాలు సంభవిస్తే ఏ విధంగా స్పందించాలి,ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఎలా వ్యవహరించాలి, ప్రమాదం జరిగితే వైద్య, పోలీస్ సిబ్బందితో పాటు తమ నుంచి ఎటువంటి సహకారం పొందాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల అగ్నిమాపక సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.